నేటి కందం- నేటికి అందం

గాడిన పెట్టి వ్యవస్థను
వేడుకగా కృషి నొనర్చి విశ్వము మెచ్చన్
మోడీ మన దేశమ్మును
మూడవ స్థానమున నిలిపె పూనిక తోడన్ !!

(వ్యవస్థను గాడిలో పెట్టి, శ్రమించి మోడీ మన దేశాన్ని ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడంతో భారతీయులు గర్విస్తున్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: భైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

తిరోగమన పాలనైతే
తెల్చుతారు ప్రజలే
ఫలితమేమి తీర్పిస్తే
ప్రతిపక్షం మొదలే
అభివృద్ధి సంక్షేమం
అమలుతీరే ప్రమాణం
ఐదేళ్ల కాలవ్యవధి
అధికారం కొలమానం

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 3-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:120 పేజీలు:6 వెల: రూ.1/-


## కడుపులో విషం తగ్గించుకుంటే మంచిది: సీఎం కీలక సూచన

హైదరాబాద్, జనవరి 2: (నేటినిజం ప్రతినిధి): కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా.. అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు.

మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు.

తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. జలవనరులను కలుషితం చేసి కబ్జాలు పెట్టి ఫాంహౌస్‌లు నిర్మించారని.. వాటి డ్రైనేజీలను జంట జలాశయాలకు కలిపారని మండిపడ్డారు. అందుకే ఆ డ్రైనేజీలను కూలగొట్టి.. కబ్జాలపై చర్యలు తీసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

అయితే మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు.

గతంలో గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60 వేల కుటుంబాలను మరో ప్రాంతానికి తరలించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. యూపీలో గంగా నది



ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారన్నారు. నది పరివాహక ప్రాంతాల అభివృద్ధిని బీజేపీ ఎన్నికల అజెండాగా మర్చిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించట్లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నదులు కలుషితం చేసి నివాస యోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు.

మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ ప్రక్షాళన కన్సల్టెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచామన్నారు. 3 సంస్థల జాయింట్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ చేపడుతున్నట్లు వివరించారు. గోదావరి నుంచి 20 టీఎంసీలు నగరానికి తరలించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

నగరం దాహార్తి తీర్చేందుకు 15 టీఎంసీలు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మరో 5 టీఎంసీలు గండిపేటకు తరలించాలని యోచన తమ ప్రభుత్వానికి ఉందని వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నాం మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాల నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర కమిటీ

న్యూఢిల్లీ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నెలకొన్న నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర జల్ శక్తి శాఖ కమిటీని నోటిపై చేసింది. ఈ కమిటీకి కేంద్ర జల సంఘం ఛైర్మన్ నేతృత్వం వహించనున్నారు. కమిటీలో సభ్యులుగా తెలంగాణ, ఎపి నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులు ఉండనున్నారు. కృష్ణా, గోదావరి బోర్డుల ఛైర్మన్లకు కమిటీలో సభ్యులుగా స్థానం కల్పించారు. ఎన్‌డబ్ల్యూడిఎ చీఫ్ ఇంజినీర్, సిడబ్ల్యూసి చీఫ్ ఇంజనీర్ కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు.

## తెలంగాణ డిజిపి ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత బర్సే దేవా

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోవడం గత కొంతకాలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. కేంద్రం చేపట్టిన ఆపరేషన్లలో పలువు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం.. మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోవడం జరుగుతోంది. తాజాగా మావోయిస్టు అగ్రనేత బర్సే దేవా తెలంగాణ డిజిపి ఎదుట లొంగిపోయారు. మరో 15 మంది మావోయిస్టులతో కలిసి బర్సే దేవా లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా బర్సే బాధ్యతలు నిర్వర్తించారు. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీలో బర్సే కీలకంగా ఉన్నారు. మావోయిస్టు పార్టీ సాయుధ బలగాల వ్యవహారాలను చూస్తున్నారు. కాగా, హిడ్మా, బర్సే దేవా ఛత్తీస్‌గఢ్‌లో ఒకే గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మావోయిస్టులకు



ఆయుధాల సరఫరాలో దేవా కీలక పాత్ర పోషించారు. ఎన్ని తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు నుంచి బర్సే దేవా బృందాన్ని పోలీసులు తీసుకువచ్చారు. బర్సే లొంగుబాటు వివరాలను డిజిపి శివధర్ రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించనున్నారు.

## హైదరాబాద్ శివారు ప్రాంతాలను కమ్మేసిన దట్టమైన పొగమంచు

### ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో రోడ్డు పక్కన వాహనాల నిలిపివేత దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ శివారు ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. తెల్లవారు జాము నుంచి పొగమంచు కమ్మేయడంతో రోడ్లు, భవనాలు ఏమీ కనిపించకుండా ఉంది. దీంతో నగర శివారు ప్రాంతాలైన ఇబ్రహీంపట్నం నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, ఆదిబట్ల, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గాల్లో జీరో విజిబిలిటీ ఉంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో రోడ్డ పక్కన వాహనాలను నిలిపివేసుకున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

శంషాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. జాతీయ రహదారిపై శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పొగమంచు కమ్ముకోవడంతో రహదారి పక్కకు వాహనాలను నిలిపివేశారు. పొగమంచు కారణంగా ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై పొగమంచు దట్టంగా కమ్ముకుంది. అబ్దుల్లాపూర్మెట్ వద్ద పది అడుగుల దూరంలోని వాహనాలు కూడా కనిపించనంతగా పొగమంచు కుమ్ముకుంది. దీంతో ముందు వెళ్తున్న వాహనాలు కనిపించడం లేదు. విజిబిలిటీ లేకపోవడంతో లైట్ల వెలుతురులో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

## మూసీ ప్రక్షాళనతో చితికిపోతున్న నిరుపేదల బతుకులు

**-అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారు**
**-వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలి**
**-కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ**

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మూసీ ప్రక్షాళనతో నిరుపేదల బతుకులు చితికిపోవద్దని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. అసలు మూసీ ప్రక్షాళన ఎక్కడి నుంచి ఎక్కడి వరకు చేస్తారని ప్రశ్నించారు. వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ ప్రక్షాళనపై జరిగిన చర్చలో అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన వికారాబాద్ నుంచి చేస్తారా మధ్యలో నుంచి



చేస్తారా అని ప్రశ్నించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉందని అడిగారు. ప్రపంచంలో కాలుష్యంలో మూసీ 8వ స్థానంలో ఉందని తెలిపారు. మూసీ ఈసా నదులు కావు.. అవి ఇప్పుడు సీవరేజ్ ప్లాంట్లు అని అక్బరుద్దీన్ విమర్శించారు. నగరంలోని మురుగు అంతా మూసీ నదిలోకే వెళ్తోందని తెలిపారు. గండిపేట జలాశయంలో కూడా మురుగు నీరు కలుస్తుందని అన్నారు. దశాబ్దాల కింద నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచాలని కోరారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచితే గోదావరి జలాలను తరలించవచ్చని తెలిపారు. చార్మినార్ వద్ద మూడేళ్ల కిందట మొదలుపెట్టిన పెడస్ట్రేరియన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు.

## ఆర్మీ క్యాంప్‌లో భారీ అగ్నిప్రమాదం.. అధికారులు అలర్ట్



న్యూఢిల్లీ, జనవరి 2:ఉత్తరాఖండ్ లో ప్రమాదం చోటుచేసుకుంది. చమోలి జిల్లాలోని జోషిమఠ్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఔలి రోడ్డులో గల ఆర్మీ క్యాంప్ లో మంటలు చెలరేగాయి. క్యాంప్ లోపల ఓ దుకాణంలో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగ వ్యాపించింది. ప్రమాద సమయంలో ఆర్మీ క్యాంప్‌లో దాదాపు 100 మంది జవాన్లు ఉన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అధికారులు స్పాట్‌లో ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నూతన వాహన టాక్స్ విధానం ప్రకటించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జనవరి 2: తెలంగాణ రాష్ట్రంలో మోటారు వాహనాల పన్ను విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇవాళ(శుక్రవారం)రవాణా శాఖలో తెలంగాణ మోటారు వాహనాల పన్ను సవరణ చట్టంపై శాసన సభలో చర్చ జరిగింది. ఈ చర్చలో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. 4 వీలర్ తేలికపాటి గూడ్స్ వాహనాలకు త్రైమాసిక టాక్స్ ఉండేదని ప్రస్తావించారు. రవాణా శాఖ నిపుణులతో చర్చించి గూడ్స్‌కి సంబంధించిన వాహనాలపై లైఫ్ టాక్స్ విధిస్తూ 7.5 శాతానికి అమలు చేశామని వివరించారు. ఇది కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రోడ్ సేఫ్టీపై సెస్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ,కర్ణాటక , మహారాష్ట్ర ,గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్.

ద్విచక్ర వాహనాలకు రూ.2 వేలు, లైట్ మోటార్ వాహనాలకు రూ.5 వేలు , హెవీ వాహనాలకు రూ.10 వేలు రోడ్ సేఫ్టీ సెస్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. కొత్తగా రిజిస్టర్ అయ్యే వాహనాలకు మాత్రమే రోడ్ సేఫ్టీ సెస్ విధించినట్లు వివరించారు. ఆటోలు ,ట్రాక్టర్లకు ఇది వర్తించదని స్పష్టం చేశారు.

మరణాలు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలతోనే జరుగుతున్నాయని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఇటీవల ఒక ప్రకటన చేశారని ప్రస్తావించారు. జనవరి 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తాము రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని.. విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం విద్యాశాఖ, సంక్షేమ శాఖ, పలు పాఠశాలలు పాల్గొనేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. రోడ్డు భద్రతాపై విద్యార్థులకు, ప్రతి పౌరుడుకి అవగాహన కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. యూనిసెఫ్ సహకారంతో పలు పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తెలంగాణను రోడ్డు ప్రమాదాల రహితంగా మార్చడానికి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు మంత్రి పొన్నం ప్రభాకర్.

రాష్ట్రంలో వెయ్యి మంది రవాణా శాఖ అధికారులు ఉంటే ..1. 80 లక్షల వాహనాలు ఉన్నాయని..ఒక్కొక్కటిగా వాహనాలు పరిశీలించడం కుదరదని చెప్పుకొచ్చారు. ఎవరికీ వారే స్వయంగా వాహనాల ఫిట్‌నెస్ చూసుకోవాలని.. రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. వికారాబాద్ బస్సు ప్రమాదంలో ఎవరో చేసిన తప్పి దానికి అమాయకులు చనిపోయారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ విద్యార్థులు, ఇతర పాఠశాలల్లోని విద్యార్థులు రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

## నిస్వార్థ సేవలకు నీరాజనం.. లక్ష్మీదేవి అవార్డుల ప్రదానం




హైదరాబాద్ జనవేరి 2 (ఎక్సం ప్రెస్ న్యూస్ );నూతన ఆంగ్ల నామ సంవత్స రాన్ని పురస్కరించుకుని మాతృదేవోభవ సత్సంగ్ సంఘమిత్ర అసోసియేషన్ సయుక్త ఆధ్వర్యంలో వివిధరంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి అవార్డుల ప్రదానం వైభవంగా జరిగిందిఅబిడ్స్ లోని సూర్య లోక్ కాంప్లెక్స్ లో మాజీ మంత్రి ,మాజీ సిడబ్ల్యుసి సభ్యురాలు లక్ష్మీ దేవి గారి పేరుతో జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో మాతృదేవోభవ సత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేబీ శ్రీధర్ ముఖ్యఅతిథిగా ఆదిలీల ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆదినారాయణ ,కాంగ్రెస్ అధికార ప్రతినిధి సామాజిక సేవా కార్యకర్త రమేష్ వీరబోమ్మన , ఆర్ పి ఐ నాయకులు పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత బాలకృష్ణ దయానిధి , ప్రముఖ టివి జర్నలిస్ట్ అరుణ రవికుమార్ రఘు అరికపూడి విశిష్ఠ అతిధులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అరుణ రవికుమార్, జి సునీతారెడ్డి, రామసుబ్రమణ్యం, సత్యదీప్తి, డాక్టర్ వడలి శ్రీనివాస్, లత , కనకవర్ధిని, నివేదిత, డాక్టర్ కామేశ్వరి,ఉమా కాత్యాయిని, కుమారి అవార్డులు స్వీకరించారు. కార్యక్రమం లో ముఖ్య అతిథిగా విచ్చేసిన లక్ష్మీదేవి గారి కుమారుడు శ్రీధర్ గారు మాట్లాడుతూ లక్ష్మీదేవి మంత్రిగా నాయకురాలుగా ఆమె చేసిన సేవలను కొనియాడారు డాక్టర్ శివలెంక ఉదయలక్ష్మి సంస్థ ఆశయాలు వివరించారు. డాక్టర్ అంజనిరెడ్డి, విశ్వాప్రగసత్యనరాయణ మూర్తి, రాజ రాజేశ్వరి మా రెళ్ళ సమన్వయ కర్తలుగా వ్యవిహరించారు

## మున్సిపల్ ఎన్నికలపై మంత్రి అడ్లూరి క్లారిటీ..!

హైదరాబాద్, జనవరి 2: మున్సిపల్ ఎన్నికలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నెలాఖరు కల్లా మున్సిపాలిటీల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇవాళ(శుక్రవారం) అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చిట్‌చాట్ చేశారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

గత రెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్ నేతల వ్యవహార శైలి చూస్తున్నామని.. వారి పంతం నెగ్గించుకోవడానికి ఏమైనా చేస్తారని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే ముఖం బీఆర్ఎస్ నేతలకు లేదని ఎద్దేవా చేశారు. తమ తప్పు ఉంటే అసెంబ్లీలో నిరూపించాలని సవాల్ విసిరారు. మూసీ అంశంలో బీఆర్ఎస్ నేతలే రన్నింగ్ కామెంటరీ చేశారని ప్రస్తావించారు. బీఆర్ఎస్ ప్రభావం కోల్పోయిందని.. ఉనికి కాపాడుకోవడానికి ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

నరేగా పథకంపై, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడలేక బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పేదవారి పథకం గురించి బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల విద్యార్థులకు వేడి నీటిని అందించడానికి సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని అన్నారు. ఇందుకోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో కనీసం గౌరవం ఇవ్వలేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సావిత్రిబాయి పూలే : ఆధునిక విద్యకు తల్లి

(03 జనవరి "సావిత్రీబాయి పూలే జయంతి" లేదా "తెలంగాణ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం" సందర్భంగా)

ప్రేమ స్వరూపిణి, భారతీయ సంఘ సంస్కర్త, రచయిత్రి, తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సమాజ విప్లవకారిణి, తొలి మహిళా ఉపాధ్యాయురాలు, తొలి బాలికల పాఠశాల వ్యవస్థాపకురాలు, కుల వ్యవస్థ వ్యతిరేకి, మహిళా హక్కుల పరిరక్షకురాలు, పేదల పక్షపాతి, ధైర్య కవచం ధరించిన ధీశాలి, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సావిత్రిబాయి పూలే కులమతాలకు అతీతంగా సమానత్వ సాధనకు కృషి చేసిన మహోన్నత మహిళ. నిమ్నవర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన జ్యోతీరావ్ పూలే సహధర్మచారిణి అయిన సావిత్రిబాయి, తన భర్తతో కలిసి 01 జనవరి 1848 రోజు పూణెలో ప్రప్రథమంగా బాలికల పాఠశాలను ప్రారంభించిన ధీరవనిత. అస్పృశ్యులు, శూద్రులు, పితృస్వామ్యం, పురుషాధిక్య సమాజ పోకడలు, సకల జనుల హక్కుల ఉల్లంఘనలు, లింగ వివక్ష, కుల వ్యవస్థలకు వ్యతిరేకంగా గళమెత్తిన వీర సబల మహిళా శిరోమణి మన సావిత్రిబాయి పూలే. చీకటి యుగంలో సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమ న్యాయాల సాధనకు కృషి చేసిన ధైర్య మహిళామణి మన సావిత్రిబాయి.

ప్రతికూలతతో ఎదిరిస్తూ, అడుగు ముందుకు వేస్తూ..!

03 జనవరి 1831 రోజు మహారాష్ట్ర కాస్తారా జిల్లా నయాగావ్ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన సావిత్రిబాయికి తెలంగాణలోని నిజామాబాదు, ఆదిలాబాదు జిల్లా ప్రాంతాల్లోకి మున్నూరుకాపు వర్గానికి చెందిన బంధువులు కూడా ఉండడం ఒక విశేషం. తన 9వ ఏటనే 13 ఏండ్ల జ్యొతిరావ్ పూలేను వివాహమాడిన సావిత్రిబాయి తన భర్తతో కలిసి నడిచి సంఘ సంస్కరణకు పూనుకున్నారు. ఉన్నత, అగ్ర వర్ణాలు వ్యతిరేకించినా వెరవకుండా, భౌతిక దాడులకను కూడా సహిస్తూ, బురద చల్లినా తుడుచుకుంటూ, అసభ్య పదజాల దూషణలను పెడచెవినపెట్టి తమ లక్ష్య సాధనకు జీవితాలను అంకితం చేసిన పుణ్య దంపతులు సావిత్రిబాయి జ్యోతిరావ్వ పూలేలు. నాటి బడుగు వర్గాల ప్రోత్సాహంతో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా సాధికారతకు ఆనాడే బీజాలు వేసారు. తమకు సంతానం లేకపోయినా ఒక బ్రాహ్మణ వితంతువు కూమారుడైన యశ్వంతరావును దత్తత తీసుకున్నారు.

తెలంగాణ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం-2026:

ఆనాటి సమాజ కట్టుబాట్లు, బ్రాహ్మణ ఆధిక్య సంప్రదాయాలు, అగ్రవర్ణాల పెత్తనాల మధ్య 12 మే 1848 రోజు బహుజనులకు పాఠశాలను ప్రారంభించారు. ఎన్ని అవమానాలు ఎదులైనా మడమ తిప్పని ధైర్యశాలా మన సావిత్రిబాయి. తమ జీవితకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో 52 వరకు పాఠశాలలు నెలకొల్పి బడుగుల బతుకుల్లో సరస్వతీ మాత అక్షర వెలుగులు ప్రసరింపజేశారు. తాము నమ్మారు విలువలకు కట్టుబడిన దంపతులు గృహ బహిష్కారానికి కూడా గురి అయ్యారు. సావిత్రిబాయి పూలే జన్మదినం రోజును తెలంగాణ ప్రభుత్వం "తెలంగాణ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం"గా నిర్వహించుకోవాలని నిర్ణయించడం సముచితంగా ఉన్నది. స్త్రీల అభ్యున్నతి కోరి 1952లో "మహిళా సేవా మండల్" అనే సంఘాన్ని ఏర్పాటు చేసిన సావిత్రి బాయి మహిళల హక్కుల పరిరక్షణకు అవిశ్రాంత పోరాటం చేశారు.

ఆత్మ సౌందర్యరాశి సావిత్రిబాయి:

మహిళా హక్కులే మానవ హక్కుల్ని నినదించిన మేటి వనిత మన సావిత్రి. అసత్య అగ్రవర్ణ దురహంకారాలకు వ్యతిరేకంగా 1873లో ఆధ్యాత్మిక పునాదులతో "సత్యశోధక్ సమాజ్" అనబడే సంఘాన్ని ప్రారంభించి బాల్య వివాహాలు, మేధ నమ్మకాలు, వితంతువుల శిరోముండనం, సతీసహగమనాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే, వితంతు పునర్వివాహాలకు పునాదులు వేసి తమ ఆత్మ సౌందర్యాన్ని రుజువు చేసుకున్నారు. వితంతువులకు ఆశ్రయం, పేద ఆడ పిల్లలకు అన్నం పెట్టడం, గర్భవతులకు పురుళ్లు పోయడం, పురోహితులు లేకుండా వివాహాలు చేయడం, కులాంతర వివాహాలు చేయడం, తల్లి వదిలేసి వెళ్లిన అనాథ శిశువును దత్తత తీసుకోవడం, అంటరానితనాన్ని రూపుమాపడం, కరువు సమయాల్లో వేల మంది బడుగు బలహీనవర్గాల ప్రజలను అక్కున చేర్చుకోవడం, తమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేయడం లాంటి అసాధ్య లక్ష్యాలను సుసాధ్యం చేసింది మన మహా మహిళ సావిత్రిబాయి పూలే.

నిత్య చైతన్య జ్ఞానజ్యోతి:

1954లో రచయిత్రిగా "కావ్యపూలే", 1891లో "పావన కాశీ సుభోధ్ రత్నాకర్" అనబడే కవితా సంపుటులను ప్రచురించిన సావిత్రిబాయి పూలే ఉపన్యాసాలను 1892లో పుస్తకరూపంలోకి తేవడం జరిగింది. 28 వనంబర్ 1890 రోజు భర్త జ్యోతీరావ్ పూలే మరణంతో అంతులేని దుఃఖాన్ని దిగమింగుతుంటూ దేశంలోనే తొలిసారి తన భర్త చితికి తానే స్వయంగా నిప్పు పెట్టి మరో అభ్యుదయ అధ్యాయానికి తెర తీసారు. 1897లో వచ్చిన ప్లేటు వ్యాధి సమయంలో తన కుమారుడితో కలిసి వ్యాధిగ్రస్థులకు సేవలు చేశారు. కరువు, ప్లేటు వ్యాధి రెచ్చిపోయిన సమయంలో జోలె పట్టి విరాళాల సేకరణ, వైద్య శిబిరాల నిర్వహణ, వేల నిరుపేదలకు బుక్కెడా బువ్వ పెట్టడం, ప్లేగు వ్యాధి బాధిత పిల్లలకు సేవలు చేస్తూ, అదే వ్యాధి బారినపడిన సావిత్రిబాయి 10 మార్చి 1897 రోజు తుది శ్వాస విడిచారు. మన ఏకైక శత్రువు అజ్ఞానమని, అన్ని సమస్యలకు ఔషధం విద్య అంటూ ప్రచారం చేసిన సావిత్రిబాయి "నిత్య చైతన్య జ్ఞాన జ్యోతి".

"ఆధునిక విద్యకు తల్లి (మదర్ ఆఫ్ మాడ్రన్ ఎడ్యుకేషన్)" మహిళా విముక్తిదాత, గొప్ప మానవతావాది, విప్లవకారిణి అయిన సావిత్రిబాయి పూలే సుసంపన్న జీవితం నేటి యువతరానికి దారి దీపం కావాలని ఆశిద్దాం, ఆమె మహోన్నత ఆశయాలను పూర్తి చేయడానికి అవిరళ కృషి చేద్దాం.

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# వికసిత్ భారత్ సాధనలో ప్రధానాంశమైన సమీకృత ఎరువుల క్లెయిము ప్రక్రియ ప్రారంభం: శ్రీ జేపీ నడ్డా



న్యూ ఢిల్లీ, జనవరి 2: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా దార్శనికతకు, 2047 నాటికి వికసిత భారత్ సాధించాలనే లక్ష్యానికి అనుగుణంగా డిజిటల్ పరిపాలన, ఆర్థిక సంస్కరణలను బలోపేతం చేసే దిశగా ఎరువుల విభాగం ముఖ్యమైన చర్య చేపట్టింది. న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్లో ఈ-బిల్లు వ్యవస్థను కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ఈ రోజు ప్రారంభించారు. ఇది సుమారుగా రూ. 2 లక్షల కోట్ల ఎరువుల సబ్సిడీని చెల్లించే వీలును ప్రభుత్వానికి కల్పిస్తుంది.

పారదర్శకమైన, సమర్థమైన, సాంకేతిక ఆధారిత పాలనను బలోపేతం చేయడంలో ఈ ఆన్లైన్ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తుందని కేంద్ర మంత్రి అన్నారు. విభాగానికి సంబంధించిన ఆర్థిక కార్యకలాపాలను ఆధునికీకరించడంలో ప్రధాన విజయంగా ఈ ప్రారంభం నిలుస్తుందని ఎరువుల కార్యదర్శి శ్రీ రజత్ కుమార్ మిశ్రా అన్నారు. ఎలాంటి భౌతిక బిల్లులను పంపించాల్సిన అవసరం లేకుండా.. కాగితాన్ని ఉపయోగించే పద్ధతుల నుంచి పనిని పూర్తిగా డిజిటల్ రూపంలోకి నూతనంగా ప్రారంభించిన వ్యవస్థ మారుస్తుంది.

ఎరువుల విభాగానికి చెందిన ఐఎఫ్ఎంఎస్ (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టమ్), ఆర్థిక మంత్రిత్వ శాఖలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ)కు చెందిన పీఎఫ్ఎంఎస్ మధ్య భాగస్వామ్యం ఫలితమే ఈ కార్యక్రమం.

అన్ని ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కేంద్రీకృతమైన, మార్చడానికి వీలు లేని డిజిటల్ ఆడిట్ నిర్వహణను రూపొందించి,, పారదర్శకతను, జవాబుదారీతనాన్ని గణనీయంగా పెంచు తుందని సీసీఏ శ్రీ సంతోష్ కుమార్ అన్నారు. తద్వారా పర్యవేక్షణను మెరుగుపరిచి, తనిఖీలను సులభతరం చేస్తుందని తెలిపారు. ఖర్చులను నిరంతరం పర్యవేక్షించడంలో, ఆర్థిక నియంత్రణను బలోపేతం చేయడంలో ఉన్నతాధికారులకు ఈ వ్యవస్థ సహకరిస్తుంది. అలాగే.. ఏకీకృత వ్యవస్థ ద్వారా అన్ని చెల్లింపులను నిరంతరం పర్యవేక్షించి నివేదికను అందిస్తుంది.

విభాగానికి చెందిన అంతర్గత వ్యవస్థ, పీఎఫ్ఎంఎస్ మధ్య సమాచారాన్ని సజావుగా మార్చుకొనే వీలును కల్పిస్తుంది. అలాగే డేటాను రెండోసారి ఎంట్రీ చేయడాన్ని నివారిస్తుంది. మానవ పొరపాట్లను నిరోధిస్తుంది. అలాగే.. మొత్తం ప్రక్రియ సామర్థ్యాన్ని, డేటా కచ్చితత్వాన్ని పెంపొందిస్తుంది.

ఈ వ్యవస్థ ఎండ్ - టు - ఎండ్ డిజిటల్ బిల్లు ప్రక్రియలను చేపడుతుందని, తద్వారా వారాంతపు రాయితీ చెల్లింపులను సకాలంలో చేయడమే కాకుండా.. చెల్లింపులు చేసే సమయాన్ని తగ్గిస్తుందని జేఎస్ (ఎఫ్ అండ్ ఏ) మనోజ్ సేథీ అన్నారు. అదనంగా, ఎరువుల కంపెనీలు తమ క్లెయిములను ఆన్లైన్లో సమర్పించడానికి, చెల్లింపుల స్థితిని ట్రాకు చేసుకొనే వీలును కల్పించడం ద్వారా వినియోగదారు సౌకర్యాన్ని ఈ-బిల్లు వేదిక పెంపొందిస్తుంది. అలాగే కార్యాలయాలకు వచ్చి వాకబు చేయాల్సిన అవసరాన్ని తొలగిస్తుంది. ఈ శాఖలో.. ప్రామాణికమైన ఎలక్ట్రానిక్ పని తీరును (ముందు వచ్చిన బిల్లును మొదట పూర్తి చేయడం లాంటివి) అమలు చేస్తుంది. అలాగే బిల్లుల నిర్వహణలో స్థిరత్వం, న్యాయం, ఆర్థిక నియమాలను పాటించేలా చూస్తుంది. అలాగే సమాచార వ్యవస్థలోని లోపాలను తగ్గిస్తుంది. వ్యవస్థ నిర్వహణను సరళీకరిస్తుంది. సమాచార ఆధారిత నిర్ణయాలు, విధాన రూపకల్పన, బడ్జెట్ను సమర్థంగా నిర్వహించడంలో సహకరించేందుకు సమగ్ర ఆర్థిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తుంది.

ఈ కార్యక్రమంలో ఏఎస్ అనీతా సీ మెశ్రం, ఏఎస్ అపర్ణ శర్మ, జేఎస్ కేకే పాఠక్, జేఎస్ అనురాగ్ రోహతగీ, డైరెక్టర్ లబోనీ దాస్ దత్తా పాల్గొన్నారు.

దీనికి సంబంధించిన సాంకేతిక నైపుణ్యాలను, క్రమబద్ధీకృత నిర్మాణాన్ని ఎన్ఐసీ, సీనియర్ టెక్నికల్ డైరెక్టర్ శ్రీ అసీమ్ గుప్తా వివరించారు. ఈ వేదికను ప్రారంభించడం, దీనికి సంబంధించిన వివరాలను అందించడంలో జాయింట్ డైరెక్టర్ శ్రీ అశుతోష్ తివారీ, డెవలపర్ శ్రీ హరేకృష్ణ తివారీతో సహా ఎన్ఐసీ బృందం మంచి సహకారం అందించింది. ఈ వ్యవస్థను రూపొందించి, అమలు చేయడంలో ఎన్ఐసీ ప్రయత్నాలకు అభినందనలు లభించాయి.

సమీకృత ఈ-బిల్లు వ్యవస్థ.. ఆర్థిక పాలనను గణనీయంగా మెరుగుపరుస్తుంది. ముందుగానే నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా చెల్లింపును ధ్రువీకరించే బలమైన, అంతర్నిర్మిత నియంత్రణలతో, ఆడిట్కు అనుగుణంగా ప్రతి చర్యను నమోదు చేస్తుంది. అలాగే పారదర్శకమైన, సమర్థమైన, సాంకేతిక ఆధారిత పరిపాలన అందించాలనే ప్రభుత్వ నిబద్ధతను బలోపేతం చేస్తూ.. మోసం లేదా దుర్వినియోగం ముప్పులను తగ్గిస్తుంది.

# ఫిబ్రవరి 1 తర్వాత జారీ చేసే కొత్త ఫాస్ట్యాగ్ల కోసం కార్లకు కేవైవీ ప్రక్రియ నిలిపివేత

న్యూ ఢిల్లీ, జనవరి 2:ప్రజల సౌకర్యాన్ని మెరుగుపరచడానికి, రహదారుల వినియోగదారులు ఎదుర్కొంటున్న యాక్టివేషన్ అనంతర సమస్యల్ని తొలగించడానికి కీలక చర్యలు చేపట్టిన నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్హెచ్ఏఐ)... 2026 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి జారీ చేసే అన్ని కొత్త ఫాస్ట్యాగ్ల (కారు/జీప్/వ్యాన్ కేటగిరీ ఫాస్ట్యాగ్) కోసం 'నో యువర్ వెహికల్' (కేవైవీ) ప్రక్రియను నిలిపివేయాలని నిర్ణయించింది.

చెల్లుబాటు అయ్యే వాహన పత్రాలు ఉన్నప్పటికీ... ఫాస్ట్యాగ్ యాక్టివేషన్ అనంతర కేవైసీ అవసరాల కారణంగా అసౌకర్యం, జాప్యంతో ఇబ్బందిపడుతున్న లక్షలాది సాధారణ రహదారి వినియోగదారులకు ఈ సంస్కరణ గణనీయ ఉపశమనాన్ని కలిగిస్తుంది.

ఇప్పటికే కార్లకు జారీ చేసిన ఫాస్ట్యాగ్ల కోసం కేవైవీ ఇకపై తప్పనిసరి కాదు. లూజ్ ఫాస్ట్యాగ్లు, తప్పుగా జారీ చేసినవి, దుర్వినియోగం చేసినవిగా ఫిర్యాదులు అందిన నిర్దిష్ట సందర్భాల్లో మాత్రమే కేవైవీ అవసరం అవుతుంది. ఎలాంటి ఫిర్యాదులు లేనట్లయితే, ప్రస్తుతం వాడుకలో ఉన్న ఫాస్ట్యాగ్లకు ఎలాంటి కేవైవీ అవసరం లేదు.

బలమైన ప్రీ-యాక్టివేషన్ భద్రతా చర్యలు ప్రారంభం

వినియోగదారుల కోసం ఈ ప్రక్రియను సులభతరం చేస్తూ అదే సమయంలో కచ్చితత్వం, సమ్మతి, సాంకేతిక వ్యవస్థ సమగ్రతను నిర్ధారించడానికి ఫాస్ట్యాగ్లను జారీచేసే బ్యాంకుల కోసం ప్రీ-యాక్టివేషన్ ధ్రువీకరణ నిబంధనలను ఎన్హెచ్ఏఐ మరింత బలోపేతం చేసింది:

తప్పనిసరి వాహన్ ఆధారిత ధ్రువీకరణ: వాహన్ డేటాబేస్ నుంచి వాహన వివరాలను ధ్రువీకరించిన తర్వాత మాత్రమే ఫాస్ట్యాగ్ యాక్టివేషన్కు అనుమతి ఉంటుంది.

యాక్టివేషన్ అనంతర ధ్రువీకరణ లేదు: యాక్టివేషన్ అనంతర ధ్రువీకరణకు అనుమతించే మునుపటి నిబంధనను నిలిపివేశారు. అసాధారణ సందర్భాల్లో మాత్రమే ఆర్సీ-ఆధారిత ధ్రువీకరణ: వాహన వివరాలు వాహన్లో అందుబాటులో లేనప్పుడు, ఫాస్ట్యాగ్ను జారీచేసే బ్యాంకులు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ)ని ఉపయోగించి యాక్టివేషన్కు ముందే వివరాలను పూర్తి జవాబుదారీతనంతో ధ్రువీకరించాలి.

ఆన్లైన్ ద్వారా విక్రయించే ఫాస్ట్యాగ్లను కూడా బ్యాంకుల పూర్తి ధ్రువీకరణ తర్వాత మాత్రమే యాక్టివేట్ చేయవచ్చు.

# రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు



కర్నూలు, జనవరి 2:జిల్లాలో భూ హక్కుల పారదర్శకత దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు 141 గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల ద్వారా రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.

శుక్రవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కలిసి రైతులకు నూతన పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత భూ హక్కు పత్రాల స్థానంలో రాజముద్రతో కూడిన ఆధునిక పాస్ పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిలో యజమాని పేరు, ఆధార్, మొబైల్ నంబర్, ఫోటో, సామాజిక హోదా వివరాలతో పాటు క్యూఆర్ కోడ్ కూడా ఉండి, స్కాన్ చేయగానే భూమి వివరాలు స్పష్టంగా తెలుస్తాయని వివరించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయాన్ని అవలంబించాలని సూచించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకాల ద్వారా రైతులకు భూ హక్కులపై సంపూర్ణ భరోసా లభిస్తుందన్నారు. ఎలాంటి రాజకీయ గుర్తులు లేకుండా రాజముద్రతో పాస్ పుస్తకాలను అందించడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమన్నారు. రీ సర్వే పూర్తైన గ్రామాల్లో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, కల్లూరు మండలంలో ఐదు గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,216 పాస్ పుస్తకాలు, తడకనపల్లెలో 1,138 పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

అలాగే అన్నదాత సుఖీభవం, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా, దీపం, తల్లికి వందనం వంటి పథకాలు రైతులు, మహిళలకు మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖను దేశంలోనే అగ్రస్థానానికి తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని చెప్పారు. తడకనపల్లె చెరువును నీటితో నింపి సాగునీటి సౌకర్యం కల్పించినట్లు, పశువుల వసతి గృహాల ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్డీఓ సందీప్ కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ రామ గిడ్డయ్య, సర్పంచ్ సహేరాబీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.జుబేదాబీ, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా అనుమతులివ్వాలి

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, జనవరి 2: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు పారదర్శకంగా, వేగంగా అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్లో జిల్లా పరిశ్రమలుఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన ద్వారా జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం అవసరమైన నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ కేటాయింపులు త్వరితగతిన మంజూరు చేస్తామని తెలిపారు. ప్రధానమంత్రి ఉపాధి సృష్టి పథకం కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన యూనిట్లు త్వరగా స్థాపించబడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుప్పం, పలమనేరు, వీకోట ప్రాంతాల్లో పాడి పరిశ్రమలు, గ్రానైట్ పరిశ్రమలను ప్రోత్సహించాలని తెలిపారు. నగిరిలో ఎక్కువగా ఉన్న పవర్లూమ్ పరిశ్రమలను మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. పూతలపట్టు ధనరాజు పల్లిలో పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులు, లైసెన్సులు నిర్ణీత కాలపరిమితిలో ఆలస్యం లేకుండా మంజూరు చేయాలని అన్ని శాఖలను కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల క్లస్టర్లలో విద్యుత్ అంతరాయాలపై నివేదిక సమర్పించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అలాగే పరిశ్రమల ప్రాంతాల్లో స్థానిక పరిపాలనా సంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ, విద్యుత్ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులతో పాటు పరిశ్రమల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కమిషనర్‌కు 34 ఫిర్యాదులు..

## -ప్రజా సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు
## -కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశాలు

కర్నూలు జనవరి 2: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఇవాళ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 34ఫిర్యాదులను ఆయన స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియజేసే వేదికగా 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం ఉపయోగ పడుతోందని పేర్కొన్న కమిషనర్, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును విభాగాధిపతులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, చట్టపరమైన నిబంధనల మేరకు సమస్యలను వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజల్లో నగరపాలక సంస్థపై విశ్వాసం పెరిగేలా అధికారులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ ఎన్. చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డా. నాగ ప్రసాద్ బాబు, ఆర్ఓలు జునైద్, స్వర్ణలత, ఎంఈ మనోహర్ రెడ్డి, డిసిపి వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న, మంజూర్ బాష తదితరులు పాల్గొన్నారు.

షరీన్ నగర్, రామాలయం లైన్లో సీసీ రహదారి నిర్మించాలని భాను ప్రకాష్ వినతి.

సంతోష్ నగర్ పంచముఖి నగర్లో డబ్ల్యూబీఎం రహదారి నిర్మించాలని బి.అయన్న కోరారు.

ఎస్ఏపీ క్యాంపు తూర్పు ప్రవేశ మార్గం వద్ద అనధికార స్పీడ్ బ్రేకర్ల తొలగింపు కోరుతూ కేశవరావు వినతి.

పెద్దపాడు రోడ్డు గీత లక్ష్మి నగర్లో వీధి దీపాలు వెలగడం లేదని, చెత్త సేకరణ జరగడం లేదని వై. నాగరాజు ఫిర్యాదు.

ప్రకాష్ నగర్ సుంకులమ్మ గుడి వద్ద డ్రైనేజీ బ్లాక్ అయిందని ఇశాక్ అహ్మద్ విజ్ఞప్తి.

రాఘవేంద్ర నగర్లో పూడికతీత పనులు చేపట్టాలని ధనుంజయ్ అభ్యర్థన.

విజయ్ లక్ష్మి నగర్-2, కృష్ణా నగర్ 9/3లో ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని రాముడు, సుబ్రహ్మణ్యం కోరారు.

ఈ నేపథ్యంలో వచ్చిన అన్ని ఫిర్యాదులను సంబంధిత శాఖలకు అప్పగించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు

# గువహటి-హౌరా మార్గంలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు

న్యూ ఢిల్లీ, జనవరి 2:కొత్త ఏడాది సందర్భంగా రైల్వేశాఖ దేశానికి ఓ కానుక ప్రకటించింది. ఈ మేరకు గువహటి-హౌరా మార్గంలో తొలి వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభిస్తామని రైల్వే, సమాచార-ప్రసార, ఎలక్ట్రానిక్స్-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ రోజు న్యూఢిల్లీలోని రైల్ భవన్‌లో నిర్వహించిన ఒక సమావేశంలో మాట్లాడుతూ- ముందుగా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఆయన, కొత్త రైలు గురించి ప్రకటన చేశారు. అస్సాంలోని గువహటి నుంచి పశ్చిమబెంగాల్‌లోని హౌరా మధ్య నడిచే ఈ రైలును గౌరవనీయ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెలలోనే ప్రారంభిస్తారని చెప్పారు. ఈ రైలుకు సంబంధించి ప్రయోగాత్మక పరీక్షలు, ధ్రువీకరణ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. రైల్వేల చరిత్రలోనేగాక దేశానికి, ప్రయాణికులకు కూడా ఇదొక కీలక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది మన రైల్వేలకు కీలక సంస్కరణల సంవత్సరమని, ఇందులో భాగంగా అనేక ప్రయాణిక ప్రాధాన్య కార్యక్రమాలను అమలు చేస్తామని వెల్లడించారు.

తొలి వందే భారత్ స్లీపర్ రైలు ప్రవేశపెట్టడం ద్వారా అస్సాంలోని కామరూప్ మెట్రోపాలిటన్, బొంగైగావ్, సహా పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్, జల్పాయ్‌గురి, మాల్డా, ముర్షిదాబాద్, పూర్వ బర్ధమాన్, హుగ్లీ, హౌరా జిల్లాలు లబ్ధి పొందుతాయి. ఈ రైలులో 823 మంది ప్రయాణించే వీలుండగా, 11 త్రీ-టైర్, 4 టూ-టైర్, 1 ఫస్ట్ క్లాస్ వంతున మొత్తం 16 ఏసీ కోచ్‌లు ఉంటాయి.

ఈ బోగీలన్నిటినీ సరికొత్త సస్పెన్షన్ వ్యవస్థతో రూపొందించినట్లు శ్రీ అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. మొత్తం మీద డిజైన్ పారామితులను మరింత ఉన్నత స్థాయికి చేర్చామని చెప్పారు. ఇంటీరియర్స్, నిచ్చెనలు ఎర్గోనామిక్ డిజైన్‌తో ఉంటాయన్నారు. భద్రత-రక్షణ కోసం ప్రత్యేక పారామితులను నిర్దేశించారు.

వందే భారత్ స్లీపర్ రైలు అధిక నాణ్యతతో, రాత్రి ప్రయాణం సౌకర్యవంతంగా, సురక్షితంగా సాగేలా రూపొందిందని ఆయన వివరించారు. ఇది ప్రారంభ స్థానం నుంచి సాయంత్రం బయలుదేరి మరునాటి ఉదయం గమ్యానికి చేరేలా ప్రయాణ వేళలు నిర్ణయిస్తామని చెప్పారు.

వందే భారత్ స్లీపర్ రైలులో ప్రయాణికులు ప్రత్యేక ప్రాంతీయ వంటకాల రుచులను ఆస్వాదించవచ్చు. గువహటి నుంచి బయల్దేరే రైలులో అస్సామీ పాకశైలి వంటకాలు, తిరిగి కోల్‌కతా నుంచి బయల్దేరినపుడు సంప్రదాయ బెంగాలీ వంటకాలను రుచి చూడవచ్చు. మొత్తం మీద ఈ ప్రయాణం ఆహ్లాదకరంగా, సాంస్కృతికంగా, విశిష్ట భోజనానుభవాన్నిస్తాయి.

భారతీయ రైల్వేల్లో ఓ నవశకానికి తొలి వందే భారత్ స్లీపర్ రైలు నాంది పలుకుతుంది. ఆధునిక సదుపాయాలతో రాత్రివేళ ప్రయాణం వేగంగా, సౌకర్యవంతంగా సాగుతుంది. సురక్షిత, వేగవంతమైన, సౌకర్యవంతమైన, సాంస్కృతిక సుసంపన్న ప్రయాణ అనుభవాన్నిస్తుంది. ప్రయాణిక ప్రాధాన్య సేవలు, సాంకేతిక ఆవిష్కరణలు, ప్రాంతీయ అనుసంధానంపై రైల్వేల దూరదృష్టిని ప్రస్ఫుటం చేస్తుంది.

## సైకిలింగ్‌లో ఎస్. సురేశ్ కుమార్ స్ఫూర్తిదాయక విజయం.. అభినందించిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జనవరి 2:శ్రీ ఎస్. సురేశ్ కుమార్ గారు సాధించిన అసాధారణ విజయాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రశంసించారు. శ్రీ సురేశ్ కుమార్ బెంగళూరు నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు.

ఈ సాహసకృత్యం ప్రశంసనీయం, స్ఫూర్తిదాయకం.. సురేశ్ కుమార్ గారి దృఢ సంకల్పానికీ, మొక్కవోని ఉత్సాహానికీ నిదర్శనం. విశేషించి, గంభీర ఆరోగ్య సవాళ్లను అధిగమించి ఈ పనిని పూర్తి చేశారని శ్రీ మోదీ తెలిపారు.

ఇలాంటి ప్రయత్నాలు దేహదారుఢ్యాన్నీ, దృఢ సంకల్పాన్నీ కలబోసి దేనినైనా సాధించవచ్చని సమాజంలో విస్తృత వర్గానికి ముఖ్య సందేశాన్ని అందిస్తున్నాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

శ్రీ సురేశ్ కుమార్ గారితో ప్రధానమంత్రి స్వయంగా ఆయనకు అభినందనలను తెలియజేశారు. ఈ యాత్ర ఆయన సాహసం, పట్టుదలల వల్లే సాధ్యపడిందంటూ ప్రధానమంత్రి మెచ్చుకున్నారు.

“బెంగళూరు నుంచి కన్యాకుమారి వరకు శ్రీ ఎస్. సురేశ్ కుమార్ గారు సైకిల్ యాత్రను నిర్వహించడం ప్రశంసనీయమే కాక స్ఫూర్తిదాయకం కూడా. ఆరోగ్యవరమైన సవాళ్లను అధిగమించి మరీ ఈ అసాధారణ కార్యాన్ని ముగించడం ఆయన దృఢ సంకల్పాన్నీ, మొక్కవోని సాహసాన్నీ సూచిస్తోంది.

# జైన్ పరిశ్రమ ప్రారంభానికి ముందడుగు..

**-జైన్ ఇరిగేషన్ సంస్థకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు..**
**-రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ-జిల్లా కలెక్టర్..**



నంద్యాల, జనవరి 2: నంద్యాల జిల్లాలో పారిశ్రామికంగా ప్రగతి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు చేపట్టి అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పరిశ్రమల ప్రిన్సిపల్ సెక్రెటరీ యువరాజ్ పేర్కొన్నారు. జూపాడు బంగ్లా మండలం తంగడంచ గ్రామ పరిధిలో ఉన్న జైన్ ఇరిగేషన్ సంస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పించి పరిశ్రమ ప్రారంభానికి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా స్పష్టం చేశారు.

ఇవాళ అమరావతి సచివాలయం నుండి పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యువరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్‌లో జైన్ ఇరిగేషన్ సంస్థ ఉత్పత్తి కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యువరాజ్ మాట్లాడుతూ సుమారు 623.40 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న జైన్ ఇరిగేషన్ సంస్థలో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల తయారీతో పాటు ఫ్రూట్ జ్యూస్ పరిశ్రమ పనులు ప్రారంభించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అత్యవసర ప్రాతిపదికన సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు.

ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం నుండి సుమారు 17 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా 0.155 టీఎంసీ నీటి సరఫరా కోసం అవసరమైన అంచనా వేసిన రూ.15 కోట్లను జైన్ ఇరిగేషన్ సంస్థే భరిస్తుందన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే నందికొట్కూరు నుంచి ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు వెళ్లే పైప్‌లైన్ ద్వారా నందికొట్కూరు ప్రాంతం నుండి జైన్ పరిశ్రమకు నీటిని విడుదల చేసుకునే అవకాశాలపై సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను సూచించారు. జైన్ ఇరిగేషన్ పరిశ్రమకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు 133 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వచ్చే ఆరు నెలల లోపు సంస్థకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ. జైన్ ఇరిగేషన్ సంస్థకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టేందుకు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ ప్రతాప్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సుధాకర్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మహబూబ్ బాషా, జైన్ ఇరిగేషన్ సంస్థ ప్రతినిధి మౌలాలిలతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం సాధిస్తూ పనులను వేగవంతం చేసి, మౌలిక సదుపాయాల కల్పనను సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# చిన్న కంపెనీల పెయిడ్ అప్: షేర్ క్యాపిటల్, టర్నోవర్ గరిష్ట పరిమితులు పెంపు

న్యూ ఢిల్లీ, జనవరి 2:కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2025లో చేపట్టిన ప్రధాన కార్యక్రమాలు, సాధించిన విజయాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

### విలీనాలు, స్వాధీనాల వ్యవస్థలో సంస్కరణలు

కేంద్ర బడ్జెట్ 2025-26లోని పారా 101కు అనుగుణంగా కంపెనీలు (సర్దుబాట్లు, ఏర్పాటు, విలీనాలు) నిబంధనలు (2016)ను ప్రభుత్వం 2025 సెప్టెంబర్ 4న సవరించింది.

ఈ సవరణల ద్వారా కంపెనీల చట్టం 2013 లోని సెక్షన్ 233 కింద కంపెనీల విలీనాలు, విడిపోయే ప్రక్రియల పరిధిని విస్తరించారు.

ఈ సవరణల ప్రకారం కింద వివరించిన అదనపు కంపెనీలు ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని ఉపయోగించుకోవచ్చు.

నిర్దేశిత పరిమితులను పాటించే రెండు లేదా అంతకంటే ఎక్కువ జాబితా కాని కంపెనీలు (సెక్షన్ 8 కంపెనీలు మినహాయించి).

ప్రధాన సంస్థ, అనుబంధ సంస్థల వీలినం.. అయితే బదిలీ చేసే సంస్థ లిస్టెడ్ కంపెనీ అయి ఉండకూడదు.

ఒకే మాతృ సంస్థకు చెందిన రెండు లేదా అంతకంటే ఎక్కువ అనుబంధ సంస్థలు ఈ విధానాన్ని ఉపయోగించుకోవచ్చు. అయితే బదిలీ చేసే సంస్థ లిస్టెడ్ కంపెనీ అయి ఉండకూడదు.

ఈ మార్పులు కార్పొరేట్ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో సమయం, ఖర్చును గణనీయంగా తగ్గిస్తాయని భావిస్తున్నారు.

భారత్‌లో వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరచడానికి, నిబంధనల అమలును సులభతరం చేయడానికి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2025లో అనేక విధాన, నియంత్రణ, సంస్థాగత, సాంకేతిక కార్యక్రమాలను చేపట్టింది. వాటిలో

### నిబంధనల నోటిఫికేషన్

2025లో నిబంధనలను హేతుబద్ధీకరించడం, కంపెనీల పనితీరులో పారదర్శకతను పెంచడం కోసం కంపెనీల చట్టం 2013 కింద ఉన్న పలు నిబంధనలను మంత్రిత్వ శాఖ సమీక్షించి, సవరణలను ప్రకటించింది.

### జారీ చేసిన సర్క్యులర్లు

ఎంసీఏ వీ3 పోర్టల్‌కు మారే సమయంలో కంపెనీలకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి మంత్రిత్వ శాఖ పలు జనరల్ సర్క్యులర్లను జారీ చేసింది. కొత్త సాంకేతిక పోర్టల్‌లోకి సులభంగా మారడానికి వెసులుబాటు కల్పించారు. అదనపు రుసుములను సడలించడానికి దాఖలు చేసే గడువును పొడిగించారు. వీడియో కాన్ఫరెన్సింగ్ లేదా ఇతర ఆడియో విజువల్ సాధనాల ద్వారా వార్షిక సాధారణ సమావేశాలు, అసాధారణ సాధారణ సమావేశాలు నిర్వహించుకోవడానికి అనుమతిని కొనసాగించారు. ఈ చర్యలు పరివర్తన దశలో కంపెనీలపై ఉన్న భారాన్ని గణనీయంగా తగ్గించాయి.

డిసెంబర్ 1, 2025న విడుదల చేసిన ఎంసీఏ నోటిఫికేషన్ నెంబర్ (జీఎస్ఆర్ 880(ఈ) ద్వారా చిన్న కంపెనీల షేర్ క్యాపిటల్ పరిమితిని రూ. 10 కోట్ల వరకు, టర్నోవర్ పరిమితిని రూ. 100 కోట్ల వరకు పెంచారు.

ప్రభుత్వ కంపెనీల మూసివేత ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ 31 డిసెంబర్ 2025న కంపెనీల (రిజిస్టర్ నుంచి పేర్ల తొలగింపు) నిబంధనలు 2016లో సవరణలు చేశారు. కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 248 (2) ప్రకారం కార్యకలాపాలు లేని కంపెనీలు తమ పేరును తొలగించుకోవడానికి రిజిస్ట్రార్ సీ-పీపీసీఈకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ సవరణ ప్రకారం సాధారణంగా కంపెనీని మూసివేసేటప్పుడు డైరెక్టర్లు వ్యక్తిగత బాధ్యతతో కూడిన ఇండెమ్నిటీ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. అయితే కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన లేదా నామినేట్ చేసిన డైరెక్టర్ల విషయంలో ఒక మినహాయింపు ఇచ్చారు. ఆయా డైరెక్టర్ల తరపున సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ లేదా రాష్ట్ర ప్రభుత్వ విభాగంలోని ఒక అధికార ప్రతినిధి కంపెనీ తరపున ఈ ఇండెమ్నిటీ బాండ్‌ను సమర్పించవచ్చు. కంపెనీల చట్టం 2013 లోని సెక్షన్ 248(2) నిబంధనల ప్రకారం కంపెనీల రిజిస్టర్ నుంచి తమ పేర్లను తొలగించుకోవడానికి అర్హత ఉన్న ప్రభుత్వ కంపెనీలను వేగంగా మూసివేయడమే ఈ సవరణ లక్ష్యం.

కంపెనీల (డైరెక్టర్ల నియామకం, అర్హతలు) నియమాలు 2014 లోని నిబంధన 1 కింద కంపెనీల డైరెక్టర్లకు వర్తించే వార్షిక కేవైసీ అవసరాన్ని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో జరిగిన పరిశీలన, ఆర్థికేతర నియంత్రణ సంబంధిత సంస్కరణలపై ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫార్సులు, వాటాదారుల నుంచి వచ్చిన సూచనల ఆధారంగా సమీక్షించారు. ఈ విషయంలో సంబంధించిన మంత్రిత్వ శాఖలు/విభాగాలతో సంప్రదింపులు జరిపి, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంబంధిత నిబంధనలను సవరించింది. 2025 డిసెంబర్ 31న నోటిఫై చేసిన నిబంధనల సవరణ (2026 మార్చి 31 నుంచి అమల్లోకి వస్తుంది) ప్రకారం ఇప్పటివరకు ఉన్న వార్షిక కేవైసీ దాఖలు అవసరాన్ని రద్దు చేసి, మూడు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే చేయాల్సిన సరళమైన కేవైసీ సమాచారంతో భర్తీ చేశారు. ఈ సవరణ ద్వారా అన్ని కంపెనీల డైరెక్టర్లకు నిబంధనలు పాటించడంలో గణనీయమైన సౌలభ్యాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (ఐఈపీఎఫ్ఏ) సాధించిన విజయాలు

2025 ఆగస్టులో వేగవంతమైన దావా పరిష్కారం, మెరుగైన పెట్టుబడిదారుల సహాయాన్ని అందించేందుకు ఐఈపీఎఫ్ఏ ఒక సమగ్ర పోర్టల్, ప్రత్యేక కాల్ సెంటర్‌ను ప్రారంభించింది.

ఎంసీఏ-21, ఎన్ఎస్‌డీఎల్/సీడీఎస్ఎల్, పీఎఫ్ఎంఎస్ వ్యవస్థలను ఒకే స్వయంచాలిత కార్యప్రవాహంలో సమగ్రపరుస్తుంది. దీని వల్ల షేర్లు, డివిడెండ్ల బదిలీకి ఆమోదం తర్వాత పట్టే సమయం కొన్ని నెలల నుంచి కేవలం ఒకటి రెండు రోజులకు తగ్గిస్తుంది.

ఈ పోర్టల్ ప్రారంభ మైనప్పటి నుంచి 24,026కు పైగా దావాలు ఆమోదం పొందాయి. తద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆమోదిత దావాల సంఖ్య 27,231కి పెరిగింది.

రీ-నోటిఫైడ్ ఫారం ఐఈపీఎఫ్-5, ఎలక్ట్రానిక్ వెరిఫికేషన్ రిపోర్టును 2025 అక్టోబర్ 6న ప్రవేశపెట్టారు. ఇది బ్యాంకు వివరాలు స్వయంచాలకంగా పొందడం, వాటాదారుల సమాచారాన్ని ముందుగానే ధృవీకరించడానికి వీలు కల్పిస్తుంది.

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారం, పెట్టుబడిదారుల సహాయం మరింత వేగంగా అందుతుంది.

ఈ సంస్కరణలతో దావాల పరిష్కార ప్రక్రియ పూర్తిగా డిజిటల్, పారదర్శక, పెట్టుబడిదారులకు అనుకూలమైన వ్యవస్థగా మారింది.

దివాలా, రుణాల పరిష్కార చట్టం 2016 ద్వారా సాధించిన విజయాలు, సంస్కరణలు

కాలపరిమితులను తగ్గించడానికి, విలువను గరిష్ఠంగా పెంచడానికి,పాలనను బలోపేతం చేయడానికి దివాలా, రుణ పరిష్కార చట్టం (సవరణ) బిల్లు 2025ను ఆగస్టు 12న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రుణదాతలు ప్రారంభించే దివాలా ప్రక్రియ, గ్రూప్ దివాలా, సరిహద్దులు దాటిన దివాలా ప్రక్రియల కోసం కూడా విధివిధానాలను ప్రతిపాదిస్తుంది. ప్రస్తుతం ఈ బిల్లు లోక్‌సభ సెలెక్ట్ కమిటీ పరిశీలనలో ఉంది.

2025 సెప్టెంబర్ వరకు ఈ చట్టం కింద మొత్తం 1300 పరిష్కార ప్రణాళికలు ఆమోదం పొందాయి. దీని ద్వారా రుణదాతలు రూ. 3.99 లక్షల కోట్లు రాబట్టుకున్నారు. ఇది ఆస్తుల అమ్మకం ద్వారా వచ్చే విలువతో పోలిస్తే 170.09 శాతం, ఫెయిర్ విలువకు 93.79 శాతానికి సమానం. ఆస్తుల ఫెయిర్ విలువతో పోలిస్తే రుణదాతల నష్టం సుమారు 6 శాతం కాగా, వారు అంగీకరించిన దావాలతో పోలిస్తే ఇది సుమారు 67 శాతంగా ఉంది.

సాంకేతిక ఆధారిత సంస్కరణల్లో ప్రధానంగా దివాలా, రుణ పరిష్కార చట్టం కోసం ప్రభుత్వం ఏకీకృత డిజిటల్ వేదికను ప్రస్తుతం అభివృద్ధి చేస్తోంది. దివాలా పరిష్కార ప్రక్రియలో పాల్గొనే అన్ని కీలక సంస్థలను ఒకే వ్యవస్థకు కిందకు తీసుకురావడం దీని ముఖ్య లక్ష్యం. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ), ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ), ఇన్ఫర్మేషన్ యుటిలిటీస్ (ఐయూఎన్), ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ (ఐపీఎస్) వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. ఈ సమగ్ర సాంకేతిక వేదిక ద్వారా సమన్వయం, పారదర్శకత, డేటా అందుబాటు, ప్రక్రియ సమర్థత, దివాలా విలువ వ్యవస్థ గణనీయంగా మెరుగుపడనుంది. తద్వారా వ్యాపారం చేయడంలో సౌలభ్యాన్ని మెరుగుపరచడం, రుణదాతల నమ్మకాన్ని బలోపేతం చేయడం సాధ్యమవుతుంది.

ఈ విషయంలో ఐబీబీఐ ప్రాజెక్టు కోసం ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్‌ను 16 డిసెంబర్ 2025న ప్రారంభించారు. అలాగే సిస్టమ్ ఇంటిగ్రేటర్ ఎంపిక కోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేశారు. ఆర్ఎఫ్‌పీకి ప్రతిస్పందనగా వచ్చిన సాంకేతిక బిడ్‌ల పరిశీలన ప్రస్తుతం జరుగుతోంది.

ఈ సంస్కరణలు, ముఖ్యంగా దివాలా వ్యవస్థ డిజిటల్ ఏకీకరణ, వ్యాపారాలకు రుణ లభ్యతను మెరుగుపరుస్తాయి. లావాదేవీ ఖర్చులను తగ్గించి, వేగవంతమైన మరింత అంచవేయదగిన ఫలితాలను నిర్ధరిస్తాయి. ఈ చర్యలు భారత్‌ను వ్యాపారాన్ని సులభతరం చేయడంలో ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉంచేందుకు ప్రభుత్వ ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ధరించనున్నాయి.

యాంటీట్రస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్: కొత్తగా 35 యాంటీట్రస్ట్ కేసులు నమోదు అయ్యాయి. గతంలో ఉన్న, కొత్తగా వచ్చిన కేసుల్లో కలిపి మొత్తం 19 కేసులను విచారించిన భారత పోటీ కమిషన్ తుది తీర్పునిచ్చింది.

విలీనాలు, స్వాధీనం: కంపెనీల విలీనం లేదా స్వాధీనానికి సంబంధించి మొత్తం 76 కాంబినేషన్ నోటీసులు దాఖలయ్యాయి. వేగవంతమైన విచారణ ద్వారా 78 నోటీసులను పరిష్కరించారు.

కృత్రిమ మేధపై మార్కెట్ అధ్యయనం: కృత్రిమ మేధ, ఇంటెలిజెన్స్, పోటీపై మార్కెట్ అధ్యయాన్ని భారత పోటీ కమిషన్ అక్టోబర్ 6, 2025న విడుదల చేసింది. ఈ అధ్యయనం ఏఐ మార్కెట్ నిర్మాణాలు, ధోరణులు, పోటీ సంబంధిత సమస్యలపై లోతైన అవగాహన అందిస్తుంది.

అడ్వకేసీ, సామర్థ్య పెంపు: పోటీ చట్టం, ప్రభుత్వ కొనుగోళ్లపై రాష్ట్రస్థాయి నిపుణుల ద్వారా మొత్తం 108 అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

### ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా సాధించిన విజయాలు

2024-25 బడ్జెట్‌లో ప్రకటించిన ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం.. ఐదు సంవత్సరాల్లో కోటి కంటే ఎక్కువ ఇంటర్న్‌షిప్‌లను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

2024 అక్టోబర్‌లో ఈ పథకం ప్రయోగాత్మక దశ ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా ఉన్న యువత నుంచి విశేష స్పందన లభించింది. రెండు రౌండ్లలో కలిపి మొత్తం 7.3 లక్షల మంది అభ్యర్థులు తమ ప్రొఫైల్‌లను పోర్టల్‌లో నమోదు చేసుకున్నారు.

వివిధ ప్రముఖ కంపెనీల నుంచి మొత్తం 1.65 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలు ప్రకటించారు. ఫలితంగా దాదాపు 16,000 మంది యువత ఇంటర్న్‌షిప్‌లలో చేరారు. అక్టోబర్ 2024 నుంచి ఇప్పటివరకు సుమారు 16,000 మంది యువత విజయవంతంగా తమ ఇంటర్న్‌షిప్‌లలో చేరి శిక్షణను ప్రారంభించారు.

# గంజాయిపై ఉక్కుపాదం

**-కదిరిలో గంజాయి బ్యాచ్‌కు స్పెషల్ ట్రీట్మెంట్**
**-విక్రేతలను రోడ్డుపై ఊరేగించిన పోలీసులు**
**-నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్**
**-12 మంది సేవకులు అదుపులోకి**



శ్రీ సత్య సాయి. జనవరి 2: శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో గంజాయి మాఫియాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గంజాయి విక్రయాలు, సేవించడాన్ని పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా కదిరి పోలీసులు చేపట్టిన ప్రత్యేక దాడులు ఇవాళ పట్టణవ్యాప్తంగా కలకలం రేపాయి. గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నలుగురు ప్రధాన నిందితులను బహిరంగంగా రోడ్డుపై నడిపించి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం ద్వారా కఠిన హెచ్చరిక ఇచ్చారు.

పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు కదిరి డీఎస్పీ ఆదేశాలపై టౌన్ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి యువతను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నట్టు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది.

అరెస్టైన నలుగురు నిందితులను పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా రోడ్డుపై నడిపించడం ద్వారా గంజాయి వ్యాపారంలో ఉన్నవారికి పోలీసులు గట్టి సందేశం ఇచ్చారు. ప్రజల్లో భయభ్రాంతులు తొలగించి, గంజాయి వంటి మత్తు పదార్థాలపై అవగాహన కల్పించడమే ఈ చర్య ఉద్దేశమని పోలీసులు తెలిపారు.

ఇదే సమయంలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన మరో 12 మందిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది యువకులే ఉండటం ఆందోళన కలిగించే అంశమని పోలీసులు పేర్కొన్నారు. గంజాయి సేవించడం వల్ల ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందనే విషయాన్ని వారికి వివరించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అవసరమైన చట్టపరమైన చర్యలు కూడా చేపట్టినట్లు తెలిపారు.

కదిరి పట్టణాన్ని గంజాయి రహిత ప్రాంతంగా మార్చడమే లక్ష్యంగా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. గంజాయి విక్రయాలు, సేవనంపై ఎలాంటి రాజీలేదని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా పెంచాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి మాఫియాపై పోలీసులు తీసుకున్న కఠిన చర్యలకు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా దాడులు కొనసాగితే యువత భవిష్యత్ సురక్షితంగా ఉంటుందని, కదిరి ప్రశాంత పట్టణంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# జనవరి 3న భగవాన్ బుద్ధునికి సంబంధించిన పవిత్ర పిప్రహ్వా అవశేషాల అంతర్జాతీయ ప్రదర్శనను ప్రారంభించనున్న ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జనవరి 2:భగవాన్ బుద్ధునికి సంబంధించిన పవిత్ర పిప్రహ్వా అవశేషాల అంతర్జాతీయ ప్రదర్శనను 2026 జనవరి 3వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. “ద లైట్, ద లోటస్: రెలిక్స్ ఆఫ్ ద అవేకెన్డ్ వన్'' అనే ఇతివృత్తంతో న్యూఢిల్లీలోని రాయ్ పిథోరా సాంస్కృతిక సముదాయంలో ఈ ప్రదర్శన జరగనుంది.

ఈ ప్రదర్శనలో శతాబ్దానికి పైగా కాలం తర్వాత విదేశాల నుంచి తిరిగి తీసుకొచ్చిన పిప్రహ్వా అవశేషాలను, న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియం, కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంలో భద్రపరిచిన అసలైన అవశేషాలు, పురావస్తు సంపదతో కలిపి మొదటిసారిగా ఒకే వేదికపై ప్రదర్శిస్తున్నారు.

1898లో కనుగొన్న పిప్రహ్వా అవశేషాలు ప్రారంభ బౌద్ధమత పురావస్తు అధ్యయనంలో అత్యంత కీలక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఇవి భగవాన్ బుద్ధునికి నేరుగా సంబంధం ఉన్న అత్యంత ప్రాచీన, చారిత్రకంగా ముఖ్యమైన అవశేషాలలో ఒకటిగా గుర్తింపు పొందాయి. పురావస్తు ఆధారాలు పిప్రహ్వా ప్రదేశాన్ని ప్రాచీన కపిలవస్తుతో అనుసంధానిస్తున్నాయి. కపిలవస్తు అనేది సన్యాసం స్వీకరించే ముందు భగవాన్ బుద్ధ తన ప్రారంభ జీవితం గడిపిన ప్రాంతంగా గుర్తింపు పొందింది.

ఈ ప్రదర్శన భగవాన్ బుద్ధుని బోధనలతో భారత్‌కు ఉన్న లోతైన, నాగరిక సంబంధాన్ని తెలియజేస్తుంది. దేశ గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలనే ప్రధానమంత్రి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వం నిరంతర కృషి, సంస్థాగత సహకారం, వినూత్న ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా ఈ అవశేషాలను ఇటీవల తిరిగి స్వదేశానికి తీసుకురావడం సాధ్యమైంది.

ఈ ప్రదర్శనను వివిధ ఇతివృత్తాల ఆధారంగా ఏర్పాటు చేశారు. సాంచి స్తూపం నుంచి స్ఫూర్తి పొందిన పునర్నిర్మిత వ్యాఖ్యానాత్మక నమూనా దీనికి ప్రధాన ఆకర్షణ. ఇందులో జాతీయ సేకరణల నుంచి తీసుకొచ్చిన అసలైన అవశేషాలు, అరుదైన వస్తువులను ఒకచోట ప్రదర్శించనున్నారు. ఇతర విభాగాల్లో పిప్రహ్వా పురావస్తు విశేషాల పునశ్చరణ, బుద్ధుని జీవితంలోని ముఖ్య ఘట్టాలు, దృశ్యాదృశ్యాలు: బౌద్ధ బోధనల సౌందర్య భాష, సరిహద్దులు దాటి విస్తరించిన బౌద్ధ కళలు, ఆదర్శాలు, సాంస్కృతిక కళాఖండాల స్వదేశ పునరాగమనం: నిరంతర ప్రయత్నం వంటివి ఉన్నాయి.

సాధారణ ప్రజలకు ఈ అవశేషాల ప్రాముఖ్యత సులభంగా అర్థం కావడానికి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇందులో లీనమయ్యే చిత్రాలు, డిజిటల్ పునర్నిర్మాణాలు, మల్టీమీడియా ప్రదర్శనలు ఉన్నాయి. ఈ అంశాలు భగవాన్ బుద్ధునిధ జీవితం, పిప్రహ్వా అవశేషాల ఆవిష్కరణ, అవి ప్రాంతాల మధ్య ప్రయాణించిన విధానం, వాటికి సంబంధించిన కళా సంప్రదాయాలపై సులభంగా అర్థమయ్యేలా అవగాహనను అందిస్తాయి.

# అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

## -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక

చిత్తూరు, జనవరి 2: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. ఇవాళ ఆయన గుడిపాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను పరిశీలించిన కలెక్టర్, ముఖ్యంగా సంజీవని కార్యక్రమం అమలు, ఓపీ నమోదు స్థాయి, కంప్యూటరైజ్డ్ డేటా లాగిన్ విధానాలను సమీక్షించారు.

రోగులకు అందిస్తున్న మందుల వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, డేటా ఎంట్రీపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, లాగిన్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరగాలంటే ఓపీ శాతం పెరగాలని, రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తామని పేర్కొన్న కలెక్టర్, విధులలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని మరోసారి హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో చంద్రశేఖర్, సిహెచ్ఓ సూర్యనారాయణ, విజయ్, వెంకటేష్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# సామాన్యులకు అందుబాటులోకి నిత్యావసర వస్తువులు

శ్రీకాకుళం, జనవరి 2: సామాన్యులకు అందుబాటులోకి నిత్యాసర వస్తువులు తీసుకొస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధి పెద్దరెల్లి వీధి ప్రభుత్వ రేషన్ డిపో ద్వారా కార్డుదారులకు 20 రూపాయలకే కేజీ నాణ్యమైన గోధుమపిండిని ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. సామాన్యులకు అందుబాటులో నిత్యవసర వస్తువులు ఉండేవిధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని,అందులో భాగంగానే 20 రూపాయలకు గోధుమపిండిని అందిస్తున్నామని వివరించారు. సామాన్యులకు పౌష్టికాహారం ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు



కర్నూలు జనవరి 2: జిల్లాలో భూ హక్కుల పారదర్శకత దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు 141 గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల ద్వారా రాజముద్రతో కూడిన కొత్త వట్టాదారు పాన్ వున్తకాల పంపిణీని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.

శుక్రవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కలిసి రైతులకు నూతన పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాత భూ హక్కు పత్రాల స్థానంలో రాజముద్రతో కూడిన ఆధునిక పాస్ పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వీటిలో యజమాని పేరు, ఆధార్, మొబైల్ నంబర్, ఫోటో, సామాజిక హోదా వివరాలతో పాటు క్యూఆర్ కోడ్ కూడా ఉండి, స్కాన్ చేయగానే భూమి వివరాలు స్పష్టంగా తెలుస్తాయని వివరించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయాన్ని అవలంబించాలని సూచించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ? రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకాల ద్వారా రైతులకు భూ హక్కులపై సంపూర్ణ భరోసా లభిస్తుందన్నారు. ఎలాంటి రాజకీయ గుర్తులు లేకుండా రాజముద్రతో పాస్ పుస్తకాలను అందించడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమన్నారు. రీ సర్వే పూర్తైన గ్రామాల్లో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, కల్లూరు మండలంలో ఐదు గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తయిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,216 పాస్ పుస్తకాలు, తడకనపల్లెలో 1,138 పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

అలాగే అన్నదాత సుఖీభవం, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా, దీపం, తల్లికి వందనం వంటి పథకాలు రైతులు, మహిళలకు మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖను దేశంలోనే అగ్రస్థానానికి తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదని చెప్పారు. తడకనపల్లె చెరువును నీటితో నింపి సాగునీటి సౌకర్యం కల్పించినట్లు, పశువుల వసతి గృహాల ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్డీఓ సందీప్ కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ రామ గిడ్డయ్య, సర్పంచ్ సహేరాబీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.జుబేదాబీ, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అమరావతి, జనవరి 2: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఎ.కొండూరు మండలం మారేపల్లి గ్రామంలో శనివారం మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేలో భాగంగా గ్రామంలోని 765 మంది రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతుకు ఏ కష్టం వచ్చినా మేమున్నాం అంటూ ముందుకు వచ్చే ఏకైక నాయకుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పాసుపుస్తకాలపై జగన్ బొమ్మను ముద్రించారని తాము మాత్రం నిబంధనల ప్రకారం ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని తెలిపారు. అలానే రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు వెళుతుందని ఒకవక్క రాజధాని నిర్మాణం మరోవక్క రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు పరుస్తూ కూటమి ప్రభుత్వం జెట్ స్పీడ్ తో ముందుకు వెళుతుందన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పలు ఐటీ కంపెనీలు ముందుకు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమంతో పాటు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల రూపకల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలానే మండలంలోని 31 గ్రామాలకు జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసిన కృష్ణా జలాలు సరఫరా చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మారేపల్లి గ్రామ సర్పంచ్ తాళ్లూరి నాగేశ్వరరావు. మండల డిప్యూటీ తహశీల్దార్ అరవింద్, వీఆర్వో మధుబాబు, రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి,వనపర్ల దేవిడ్ రాజు,గిరిజన సంఘం నాయుకులు బి.గోపిరాజు గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

# టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఈఓ శ్రీనివాస్



మహబూబాబాద్, జనవరి 2:మహబూబాబాద్ టిపిటిఎఫ్ 2026 సంవత్సరం క్యాలెండర్ ను పెద్దవంగర మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్సి) లో మండల విద్యాశాఖ అధికారి బుధారపు శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి,విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకిత భావంతో పనిచేయాలని అన్నారు. టీపీటీఫ్,ఉపాధ్యాయ విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందన్నారు. అదేవిదంగా హక్కుల సాదనతో పాటు బాధ్యతలు కూడా నిర్వహించాలన్నారు.

టీపీటీఫ్ మండల అధ్యక్షులు చిక్కాల సతీష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల,విద్యారంగా సమస్యల పరిష్కారంలో టీపీటీఫ్ ముందు వరుసలో ఉంటుందన్నారు.ఉపాధ్యాయుల సంక్షేమం కోసం,హక్కుల సాధన కోసం టీపీటీఫ్ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కొరకు కొత్త సంవత్సరంలో నూతన ఉత్సాహంతో ఉద్యమిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని నెరవేరే వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సోమరపు ఐలయ్య, టీపీటీఫ్ జిల్లా కార్యదర్శి పెండ్లి రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వొళ్ళల శ్రీనివాస్, రమేష్ ,రాజలింగం,గౌరీశంకర్,వెంకటేశ్వర్లు,ఎల్లగౌడ్,మురళి,చిరంజీవి, ఉపాధ్యాయులు సదయ్య,శ్రీధర్,కవిరాజు,అంబ భవని,అనూష , సిఆర్పి లు సంతోష్,రంగన్న,రవు పాల్గొన్నారు.

# భారత ఔషధ సంహితకు అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆమోదం, 19 గ్లోబల్ సౌత్ దేశాల్లో గుర్తింపు: కేంద్ర ఆరోగ్య మంత్రి




న్యూ ఢిల్లీ, జనవరి 2:భారత్ లో అధికారిక ఔషధ ప్రామాణిక గ్రంథమైన ఇండియన్ ఫార్మకోపియా–2026 (ఐపీ 2026)ను కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డా ఈ రోజు న్యూఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో ఆవిష్కరించారు. ఇది ఔషధాల నాణ్యతను, భద్రతను, సామర్థ్యాన్ని బలోపేతం చేసే దిశగా భారత్ కొనసాగిస్తున్న ప్రయత్నాల్లో ముఖ్య ప్రస్థానం.

కొత్త సంచిక ఆవిష్కరణ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీ నడ్డా ప్రసంగించారు. దేశంలోని ఔషధ ప్రమాణాలకు అధికారిక గ్రంథంగా భారతీయ ఔషధ సంహిత పనిచేస్తుందని, ఔషధాలకు సంబంధించి భారత్ అనుసరిస్తున్న నియంత్రణా విధానాల్లో కీలకంగా ఉంటుందని తెలిపారు. శాస్త్రీయ పురోగతులు, అంతర్జాతీయంగా అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులు, ఔషధాల తయారీ, నియంత్రణలో పెరుగుతున్న భారత ప్రాధాన్యాన్ని ఈ పదో సంచిక తెలియజేస్తుందన్నారు.

భారతీయ ఔషధ సంహిత 2026లో కొత్తగా 121 మోనోగ్రాఫులను చేర్చారని ఆయన చెప్పారు. దీంతో మొత్తం మోనోగ్రాఫుల సంఖ్య 3,340కి చేరుకుంది. క్షయ, మధుమేహం, క్యాన్సర్ నిరోధక ఔషధాలు, ఐరన్ సప్లిమెంట్లతో సహా కీలకమైన చికిత్సా విభాగాల్లో కవరేజీ బలోపేతమైందని ఆయన చెప్పారు. తద్వారా వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పరిధిలోఉపయోగించే ఔషధాల సమగ్ర ప్రామాణికతకు మరింత హామీ లభిస్తుందన్నారు.

ఫార్మకోవిజిలెన్స్ గురించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఆరోగ్య దౌత్యంలో ప్రధాన అజెండాగా మారిన భారతీయ ఔషధ సంహిత ప్రమాణాలకు ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా ఆమోదం లభిస్తోందన్నారు. అలాగే గ్లోబల్ సౌత్‌లోని 19 దేశాల్లో భారత ఔషధ సంహితకు ఇప్పుడు గుర్తింపు లభించిందని తెలియజేశారు.

భారత ఫార్మకోపియా కమిషన్ (ఐపీసీ) పరిధిలో నిర్వహిస్తున్న ఫార్మకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా (పీవీపీఐ) సాధించిన పురోగతి గురించి శ్రీ నడ్డా వివరించారు. 2009–2014లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఫార్మకోవిజిలెన్స్ డేటాబేస్‌కు అందించిన సహకారం ఆధారంగా.. అంతర్జాతీయంగా భారత్ ర్యాంకు 123గా ఉండేది. 2025 నాటికి అది 8వ స్థానానికి పెరిగింది. ఈ ఘనతను సాధించిన ఐపీసీ, పీవీపీఐ బృందాన్ని శ్రీ నడ్డా అభినందించారు. రోగుల భద్రత, నాణ్యతా హామీ, విస్తృతమైన నిఘా నియంత్రణల పట్ల భారత దేశ అంకితభావాన్ని ఫార్మకోవిజిలెన్స్ వ్యవస్థ బలోపేతం చేస్తుందని తెలిపారు.

భారతీయ ఔషధ సంహిత 2026లో ట్రాన్స్‌ఫ్యూజన్ ఔషధాలకు సంబంధించి 20 బ్లడ్ కాంపోనెంట్ల మోనోగ్రాఫులను మొదటిసారి చేర్చినట్లు మంత్రి తెలియజేశారు. ఔషధాలు, సౌందర్య సాధనాల (రెండో సవరణ) నియమాలు–2020కు అనుగుణంగా వీటిని చేర్చారు. ఇది నియంత్రణా పురోగతులను తెలియజేస్తుంది.

ఆరోగ్య సేవల వ్యవస్థలను, నియంత్రణా వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని శ్రీ నడ్డా తెలిపారు. ఈ నిరంతర కృషి, నాణ్యత, పారదర్శకత, ప్రజా సంక్షేమంపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని భారతీయ ఔషధ సంహిత – 2026 ప్రతిబింబిస్తుందని తెలియజేశారు.

పదో సంచికను రూపొందించిన భారత ఫార్మకోపియా కమిషన్, ఇతర భాగస్వాములందరికీ కేంద్ర మంత్రి మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు. భారత ఫార్మకోపియా – 2026 ఔషధాల నాణ్యతా ప్రమాణాలను, భారతీయ నియంత్రణా విధానాలను బలోపేతం చేస్తుందని, అంతర్జాతీయ ఔషధ రంగంలో దేశ ప్రభావాన్ని విస్తరిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

భారత ఔషధ నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా వేసిన ముందడుగును భారతీయ ఔషధ సంహిత ఆవిష్కరణ తెలియజేస్తుందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్నారు. దేశ వ్యాప్తంగా సురక్షితమైన, ప్రభావవంతమైన, నాణ్యతా హామీ ఉన్న ఔషధాలను అందించడానికి విస్తృతమైన, శాస్త్రీయ ఆధారమైన ఫార్మకోపియా అవసరమని ఆమె స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా ఉత్తమ పద్ధతులను అవలంబించడం, రోగుల భద్రత, నియంత్రణా నైపుణ్యాల్లో భారత చిత్తశుద్ధిని ప్రతిబింబించేలా ఫార్మకోపియా ప్రమాణాలను నిరంతరం మెరుగుపరచాలని, సమన్వయపరచాలని ఆరోగ్యకార్యదర్శి తెలిపారు. అదే సమయంలో ఔషధ సరఫరా వ్యవస్థలో దేశ స్థాయి పెరిగేలా తోడ్పాటు అందించాలన్నారు.

**భారతీయ ఔషధ సంహిత గురించి**

ఔషధాలు, సౌందర్య సాధనాలు చట్టం 1940లోని నిబంధనల ప్రకారం కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తరపున భారతీయ వైద్య సంహిత (ఐపీ)ను భారతీయ ఫార్మకోపియా కమిషన్ (ఐపీసీ) ప్రచురిస్తుంది. భారత్‌లో తయారయ్యే లేదా అమ్మకాలు సాగించే ఔషధాలకు సంబంధించి అధికారిక ప్రమాణాలను ఐపీ అందిస్తుంది. తద్వారా ఔషధాల నాణ్యత నియంత్రణకు, హామీకి తోడ్పడుతుంది. ఐపీ ప్రమాణాలు అధికారికమైనవి, చట్టపరమైనవి. మనదేశంలో ఔషధాల తయారీకి, పరీక్షించడానికి, పంపిణీకి అవసరమైన లైసెన్సులను అందించడంలో తోడ్పడుతుంది.

ఫార్మకోపియల్ డిస్కషన్ గ్రూప్ (పీడీజీ)లో సభ్యురాలిగా మోనోగ్రాఫులు, సాధారణ అధ్యాయాల సమన్వయానికి యూరోపియన్, జపనీస్, అమెరికా ఫార్మకోపియాలతో కలిసి ఇండియన్ ఫార్మకోపియా చురుగ్గా పనిచేస్తోంది. అంతర్జాతీయ సమన్వయ మండలి (ఐసీహెచ్) ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న భారతీయ ఔషధ సంహిత అవసరాలు.. అంతర్జాతీయ ఔషధ ప్రమాణాల పట్ల భారత్ నిబద్ధతను బలోపేతం చేస్తుంది.డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (ఇండియా) డాక్టర్ రాజీవ్ సింగ్ రఘువంశీ, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ హర్ష్ మంగ్లా, భారతీయ ఫార్మకోపియా కమిషన్ సెక్రటరీ -కమ్- సైంటిఫిక్ డైరెక్టర్ డాక్టర్ వీ కలైసెల్వన్, ఇతర పారిశ్రామిక నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అన్ని సమస్యల పరిష్కారించే ఆయుధం విద్య మాత్రమే

## -జి వి శ్యామ్ ప్రసాద్ లాల్, సంయుక్త కార్యదర్శి , మహాత్మ జ్యోతిరావ్ పూలే తెలంగాణ బిసి విద్యాలయాల సంస్థ




హైదరాబాద్, జనవరి 2:మనం చదువుకుంటున్న సెలబస్ పాఠ్యాంశాలతో పాటు మనం ఎంచుకున్న రంగం పట్ల నైపుణ్యాలను కలిగి ఉండడం, వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోవడం నేటి డిజిటల్ యువతకు కనీస అర్హతలు అవుతున్నాయని, అన్ని సమస్యల పరిష్కారానికి ఆయుధం విద్య మాత్రమే అని మహాత్మ జ్యోతిరావ్ పూలే వెనకబడిన తరగతుల విద్యాలయాల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి వి శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. ఈ రోజు లీడ్ ఇండియా 2047, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా తిమ్మాపూర్ సాంఘీక సంక్షేమ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మన ప్రియతమ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్థాపించిన లీడ్ ఇండియా ఉద్యమానికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయని, ప్రతి బక్కరు ఏకాగ్రతతో చదువుపై శ్రద్ధ వహించి ఎదగాలన్నారు. రానున్న రోజుల్లో అన్ని సాంఘిక సంక్షేమ విద్యలయాల్లో ఇలాంటి వ్యక్తిత్వ వికాస తరగతులను విస్తరించాలని లీడ్ ఇండియా బాధ్యులను కోరారు. ప్రధాన వక్త లయన్ కెప్టెన్ ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రధానాచార్యులు మాట్లాడుతూ వ్యక్తి ఉజ్వల భవిత, లక్ష్యాలను అధిగమించడానికి నేడు డిదిచల్ యువత దినచర్య, అలవాట్లు ప్రధాన భూమికను నిర్వహిస్తాయని అన్నారు. మన జీవనశైలిని బట్టి ఎదుగుదల ఆధా టరపడుతుందని, మంచి అలవాట్లు, గమ్యానికి చేరడానికి నిచ్చెన మెట్ల వలె ఉపయోగపడతాయని అన్నారు. 03 జనవరి సావిత్రిబాయి పూలేజయంతి రోజు నిర్వహించుకునే తెలంగాణ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం వేదికగా బాలికలు తమ కాళ్లపై తాము నిలబడటానికి ఉన్నత విద్య ఉపకరిస్తుందని అన్నారు. మహిళల అభ్యున్నతికి విద్య మాత్రమే ఏకైక సాధనం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా లయన్ వడకాపురం జగదీశ్వరాచారి హాజరై మాట్లాడుతూ విద్యతో పాటు వినయసంపన్నతను అలవర్చుకోవాలని సూచించారు. లయన్ ఎం మహెందర్ పాల్గొన్న తెలంగాణ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ముందస్తుగా సభాధ్యక్షురాలు ప్రిన్సిపాల్ డా: సరితతో పాటు పలువురు మహిళా ఉపన్యాసకులను లీడ్ ఇండియా–2047, శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు సముచితంగా సత్కరించారు.

# దృఢ సంకల్పం, ఇచ్ఛా శక్తి ప్రాధాన్యాన్ని చెప్పే సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 2:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నూతన సంవత్సర వేళ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో అందరి ప్రయత్నాలూ ఫలిస్తాయన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

కొత్త ఏడాదిలో చేసుకున్న తీర్మానాలను దృఢ సంకల్పంతోనూ, ఇచ్ఛాశక్తితోనూ నెరవేర్చుకోవచ్చని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఈ శాశ్వత జ్ఞానం మనకు ఉన్నతిని సాధించేందుకూ, అప్రమత్తంగా ఉండేందుకూ, సంక్షేమ ప్రదాయక కార్యాల్లో నిమగ్నం అయ్యేందుకూ ప్రోత్సాహాన్ని అందిస్తుందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. భవిష్యత్తును ఊహించడంలో మన మనస్సును స్థిరంగా, నిర్భయంగా ఉంచుకోవడంలో కూడా ఇది సాయపడుతుందని ఆయన అన్నారు.

స్ఫూర్తిదాయకమైన సంస్కృత శ్లోకాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శ్రీ మోదీ పొందుపరుస్తూ, ఇలా పేర్కొన్నారు:

“రాబోయే సంవత్సరాల్లో మీ ప్రయత్నాలన్నీ ఫలించాలని నేను కోరుకుంటున్నాను. కొత్త ఏడాదిలో మీరు చేసుకున్న తీర్మానాలు దృఢ సంకల్పంతో, ఇచ్ఛాశక్తితో నెరవేరాలని ఆకాంక్షిస్తున్నాను.

# చెన్నైలో 9వ సిద్ధ దినోత్సవ వేడుకలను ప్రారంభించనున్న

## ఆయుష్ మంత్రిత్వ శాఖ.. జనవరి 6న జాతీయ సిద్ధ దినోత్సవం

న్యూ ఢిల్లీ, జనవరి 2:9వ సిద్ధ వైద్య దినోత్సవాన్ని 2026 జనవరి 3వ తేదీన చెన్నైలోని కళైవాణర్ ప్రాంగణంలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, అనుబంధ సంస్థలైన జాతీయ సిద్ధ వైద్య సంస్థ (ఎన్ఐఎస్), కేంద్ర సిద్ధ వైద్య పరిశోధనా మండలి (సీసీఆర్ఎస్), తమిళనాడు ప్రభుత్వ భారతీయ వైద్యం, హోమియోపతి డైరెక్టరేట్ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. "ప్రపంచ ఆరోగ్యానికి సిద్ధ వైద్యం" ఇతివృత్తంతో జరిగే ఈ వేడుకలు.. సిద్ధ వైద్య పితామహుడిగా పిలిచే అగస్త్య మహర్షి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జనవరి 6న సిద్ధ దినోత్సవాన్ని జరుపుకుంటారు. అయితే ఈ ఏడాది ప్రధాన వేడుకలు జనవరి 3న జరగనున్నాయి.

ఈ వేడుకలను భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించి, అధ్యక్షత వహిస్తారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్, తమిళనాడు ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మా సుబ్రమణ్యం, కేంద్ర ఆయుష్ శాఖ కార్యదర్శి, పద్మశ్రీ వైద్య రాజేష్ కోటేచా, తమిళనాడు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పీ సెంథిల్ కుమార్, తమిళనాడు ప్రభుత్వ భారతీయ వైద్యం, హోమియోపతి డైరెక్టరేట్ డైరెక్టర్ శ్రీమతి ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

తమిళనాడుతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి సిద్ధ వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు విద్యార్థులను ఈ వేడుక ఒకే వేదికపైకి చేర్చుతుంది. సిద్ధ వైద్య చట్టపరమైన సంస్థల సీనియర్ సభ్యులు, ఎన్ఐఎస్, సీసీఆర్ఎస్ పరిశోధకులు, ఆయుష్ మంత్రిత్వ శాఖ, తమిళనాడు ప్రభుత్వ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ముఖ్యంగా చెన్నై, పాళయం కోట్టైలోని ప్రభుత్వ సిద్ధ వైద్య కళాశాలల నుంచి డిగ్రీ, మాస్టర్స్, డాక్టరేట్ విద్యార్థులు, తమిళనాడు, కేరళ రాష్ట్రాల సొంత నిధులతో నడిచే సిద్ధ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉంది.

సిద్ధ వైద్య విధానానికి అసాధారణమైన, ప్రశంసనీయమైన సేవలు అందించిన అయిదు గురు ప్రముఖులను ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ సందర్భంగా సత్కరించనుంది. నివారణ ఆరోగ్యం, పరిశోధన, ప్రపంచ శ్రేయస్సులో సిద్ధ వైద్య విధానం అందిస్తున్న సేవలను 9వ సిద్ధ దినోత్సవం ద్వారా ప్రదర్శించనున్నారు. ఆరోగ్య సంరక్షణ, పరిశోధనా సహకారం, విద్యా పురోగతిలో సిద్ధ వైద్యం పాత్రను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న నిరంతర ప్రయత్నాలను తెలియజేయడం, సిద్ధ వైద్యంపై ప్రజల్లో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం. భారతీయ సంప్రదాయ వైద్య విధానాలను జాతీయ, ప్రపంచ ఆరోగ్య వ్యవస్థల్లో ప్రోత్సహించడం, ఆవిష్కరణలను బలోపేతం చేయడం, సిద్ధ వైద్యానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించడంపై ఆయుష్ మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఈ వేడుకలు ప్రతిబింబించనున్నాయి.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజకీయ కార్యదర్శి గా బయ్యా వెంకటేశ్వర్లు యాదవ్

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజకీయ కార్యదర్శి గా బయ్యా వెంకటేశ్వర్లు యాదవ్ నియమితులైనారు .ఈ మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాజకీయ కార్యదర్శి గా నియమిఇస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. మేడ్చల్ జిల్లా ఉప్పల్ నియోజకవర్గం,కుషాగూడ డివిజన్ కు చెందిన బయ్యు వెంకటేశ్వర్లు యాదవ్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఏర్పాటులో హితోదిక కృషి చేసారు. ఈ సందర్భంగా బయ్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... నాకు అప్పగించిన ఈ బాధ్యత పట్ల పూర్తి నిబద్ధత నిజాయితీగా పని చేస్తానని నాతోటి రాష్ట్ర కమిటీ మిత్రులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటు,పార్టీనీ, పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

అలాగే భయ్యా వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ క్యాలెండర్ మరియు పార్టీ సంబంధించిన స్టిక్కర్స్ ఆవిష్కరణ పార్టీ అధినేత ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈసందర్భంగా పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎలబోయన ఓదేలు యాదవ్ , రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ , రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్ల వాసుదేవ్ మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కండి

### –మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పిలుపు

మక్తల్, జనవరి 2: త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇవాళ నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని తన నివాసంలో జరిగిన మక్తల్ మున్సిపల్ బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కెసిఆర్ ప్రభుత్వం హయాంలో మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డుల్లో చేసినటువంటి అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేనివిధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, అదేవిధంగా మక్తల్ మున్సిపాలిటీని తీసుకొచ్చిన చరిత్ర కూడా బిఆర్ఎస్ పార్టీదన్నారు.

ఆయా వార్డుల్లోని ప్రజలను చైతన్యం చేయడం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు 420 వాగ్దానాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ప్రధానంగా రైతులకు, మహిళలకు, యువతకు, విద్యార్థులకు చేసిన మోసాలను ఓటర్ల దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ప్రతి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి మోసాలను ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. ఆయా వార్డుల్లో ఉన్నటువంటి ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి దొంగ ఓట్లు ఉంటే సంబంధించిన అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన తెలియజేశారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగానే ప్రతి కార్యకర్త నడుచుకోవాలని మక్తల్ మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరవేయాలని ఆదిశగా బిఆర్ఎస్ శ్రేణులు నేటి నుండి క్షేత్ర స్థాయిలో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నర్సింహ గౌడ్, పట్టణ అధ్యక్షుడు జుట్ల చిన్న హన్మంతు, నాయకులు పసుల విష్ణువర్ధన్ రెడ్డి,అన్వర్ హుస్సేన్, జగ్గలి రాములు, మొగులప్ప, చందాపూర్ అశోక్ గౌడ్ ,కుమ్మరి రవికుమార్,మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితులకు టీపీసీసీ జగ్గారెడ్డి ఆర్థిక సహాయం

**–రెండు లక్షల చొప్పున ఐదు మంది క్యాన్సర్ పేషెంట్లకు తక్షణ సహాయం అందజేత**
**–గుట్కా తినకండి, సిగరెట్ తాగకండి.. క్యాన్సర్ బారిన పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయకండి**
**– ప్రజలకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపు**



సంగారెడ్డి జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సంగారెడ్డి నియోజకవర్గం లో క్యాన్సర్ బారిన పడిన నిరుపేదలకు జగ్గారెడ్డి తన సహాయాన్ని కొనసాగిస్తున్నాడు. గతం లో క్యాన్సర్ బారిన పడ్డ వ్యక్తులకు చికిత్స కోసం లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేసిన విషయం తెల్సిందే. తాజాగా క్యాన్సర్ తో బాధ పడుతున్న మరో ఐదు మందికి జగ్గారెడ్డి రెండు లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా గుట్కా నమలడం కారణంగా అనారోగ్యం భారిన పడ్డ క్యాన్సర్ పేషంట్ పట్ల కాస్త ఆగ్రహం వ్యక్తంచేశారు. గుట్కా సిగరెట్ తాగడం వంటి దురలవాట్ల కారణంగా క్యాన్సర్ బారిన పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. దురలవాట్ల కు దూరంగా ఉండి ఆరోగ్యంగా జీవించాలని ప్రజలను కోరారు.

# "వికసిత్ భారత్"గా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషి చేయాలి

### – బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపు

హైదరాబాద్ జనవరి 1 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); "వికసిత్ భారత్"గా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషి చేయాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పిలుపు నిచ్చారు. భారత దేశ ప్రజలందరికి, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గారు తెలిపారు.2025 సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృఢమైన, దూరదృష్టి గల నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగింది. అదే స్ఫూర్తితో, వారి అడుగుజాడల్లో నడుస్తూ 2026లో భారతదేశాన్ని "వికసిత్ భారత్"గా తీర్చిదిద్దే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వాములై కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.భారత్ ప్రస్తుతం 4.18 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. త్వరలోనే ప్రపంచంలో మూడో స్థానానికి చేరుకునే దిశగా దేశం వేగంగా ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ 2026 నూతన సంవత్సరంలో మనందరం "నేషన్ ఫస్ట్" అనే భావనతో దేశానికి మన జీవితాన్ని అంకితం చేస్తూ, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి చూపిన మార్గంలో నడుచుకుంటూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యం సాధన దిశగా ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు.

# టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**– అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ చిర్రా రవి**
**– కేకు కట్ చేసిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జి.రమేష్ బాబు**
**– నూతన కమిటీని ప్రకటించిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు**

ఖమ్మం, జనవరి 2 (నేటనిజం ప్రతినిధి) :నూతన సంవత్సర వేడుకల్లో టియుడబ్ల్యూజే (టీజేఫ్) యూనియన్ అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, కార్యదర్శి చిర్రా రవి లు హాజరై ఘనంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం జరిగింది, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో భాగంగా జర్నలిస్టులు ఎంతో ఉత్సాహంగా ఆనందంగా జరిగిన ప్రెస్ క్లబ్ నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ప్రతిపాదనలతో కార్యదర్శి చిర్రా రవి నూతన కమిటీని ప్రకటించడం జరిగింది. నూతన కమిటీలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా పొన్నేబోయిన పానకాలరావుని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా పి. పానకాలరావు మాట్లాడుతూ... టియుడబ్ల్యుజె, టీజేఎఫ్ జిల్లా యూనియన్ కమిటీకి, ఖమ్మం నగర కమిటీకి, ప్రెస్ క్లబ్ కమిటీకి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు, అనంతరం మాట్లాడుతూ... నాపై నమ్మకంతో నన్ను గుర్తించి ఇంత చక్కటి అవకాశం ఇచ్చినందుకు ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు పదవికి న్యాయం చేసే విధంగా మసులు కుంటానని

టియుడబ్ల్యూజే, టీజేఎఫ్ యూనియన్ నాకు ఏ బాధ్యత ఒప్పచెప్పినా సమర్థవంతంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉంటానని అదేవిధంగా కోరుకుంటే వచ్చే పదవి కంటే మనపై నమ్మకంతో గుర్తించి ఇచ్చిన పదవి ఎంతో ఆనందంగా ఉంటుంది అని ఆ బాధ్యతను తూచ తప్పకుండా పాటిస్తూ పెద్దలందరిని గౌరవిస్తూ ముందుకు సాగుతానని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) యూనియన్ కి ఎలాంటి విఘాతం తలపెట్టకుండా సమర్థవంతంగా యూనియన్ కి కట్టుబడి ఉంటానని తెలియజేశారు, యూనియన్ జర్నలిస్టులు అందరికీ పేరుపేరునా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## సబితా ఇంద్రారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకులు

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );2026 ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భముగా గురువారం మాజీ మంత్రి ప్రస్తుత మహేశ్వరం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డినీ మరియు రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర పార్టీ యువ నాయకుడు పట్లొల్ల కార్తీక్ రెడ్డి లను మర్యాద పూర్వకముగా భారత రాష్ట్ర సమితి పార్టీ స్థానిక నాయకులు కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తత్పర్యంతం నూతన సంవత్సర కేక్ కట్ చేయించడం జరిగినది. ఈ సందర్భముగా విచ్చేసిన పార్టీ నాయకులకు, కార్య కర్తలకు, అభిమాను లకు అందరికీ శుభాకాంక్షలు తెలియ జేసినారు. ఆ తరువాత పార్టీ మణికొండ యువ నాయకుడు ఉసేన్ జన్మదిన వేడుకల సందర్భముగా సహచర మిత్రులతో పాటు సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి లు శుభాశీస్సులు అంద జేయడం, దుశ్శాలువ్వాతో సన్మానించడం జరిగినది.

# కొత్త సంవత్సరం వేళ ఢిల్లీలో 56 శాతం పెరిగిన డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు

న్యూఢిల్లీ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశ రాజధాని ఢిల్లీలో కొత్త సంవత్సరం వేళ డ్రంకెన్ డ్రైవింగ్ కేసులు గత ఏడాదితో పోలిస్తే 56 శాతం పెరిగినట్లు పోలీసులు వెల్లడించారు. న్యూ ఇయర్ వేళ 868 డ్రంకెన్ డ్రైవింగ్ చలాన్లు జారీ చేసినట్లు పోలీసులు చెప్పారు. గత ఏడాది ఇదే రోజు ఆ సంఖ్య 558గా ఉన్నట్లు పేర్కొన్నారు. పటిష్టమైన రీతిలో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయడం వల్ల కేసుల సంఖ్య పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. డ్రంకెన్ డ్రైవింగ్, స్పీడింగ్, మోటార్‌సైకిల్ స్టంట్స్, ప్రమాదకర ఉల్లంఘనలను అడ్డుకునేందుకు ప్రత్యేక ట్రాఫిక్ బృందాలను మోహరించినట్లు అధికారులు చెప్పారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులు పెరగడం ఆందోళనకరమే అని కొందరన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రంతా అనేక ప్రదేశాల్లో బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు చెప్పారు.చెకింగ్‌ను తప్పించుకునే బైకర్‌లను పట్టుకునేందుకు అనేక చోట్ల చెక్‌పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు. సీసీటీవీ నిఘా ద్వారా సమర్థవంతంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ కొనసాగించినట్లు చెప్పారు. న్యూ ఇయర్ సంబరాల నేపథ్యంలో ఢిల్లీ పోలీసు శాఖ అదనంగా సుమారు 20 వేల సిబ్బందిని శాంతి, భద్రతల కోసం మోహరించింది. జనం రద్దీగా ఉండే ప్రదేశాలైన కన్నాట్ ప్లేస్, హౌజ్ ఖాస్,ఏరోసిటీ వద్ద ప్రత్యేక నిఘా పెట్టారు. కేవలం జరిమానా విధించడం మాత్రమే కాదు అని, మద్యం తాగి వాహనం నడపరాదు అన్న బలమైన సందేశాన్ని ఇవ్వాలన్న ఉద్దేశంతో పకడ్బందీగా ప్లాన్ అమలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఫిబ్రవరి 1 నుంచి పెరుగనున్న సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా ధరలు

న్యూఢిల్లీ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా ధరలు పెరుగనున్నాయి. వాటిపై జీఎస్టీతోపాటు అదనపు సెస్ విధించనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి పెరిగిన ధరలు అమలులోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై కొత్త సెస్సు విధించనున్నట్లు పేర్కొంది.కాగా, ఫిబ్రవరి 1 నుంచి పాన్ మసాలా, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై 40 శాతం జీఎస్టీ విధిస్తారు. బీడీలపై 18 శాతం జీఎస్టీ ఉంటుంది. అలాగే పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం కూడా విధిస్తారు. పాన్ మసాలాపై ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్సు ఉంటుంది. గతంలో ఉన్న కంపన్‌సేషన్ సెస్సు స్థానంలో ఈ కొత్త సెస్సు అమలు చేస్తారు.మరోవైపు చూయింగ్ టొబాకో, జర్దా సెంటెడ్ టొబాకో, గుట్కా ప్యాకింగ్ యంత్రాలు (సామర్థ్య నిర్ధారణ, సుంకం వసూలు) నియమాలను కూడా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది. దీంతో వాటి తయారీ మెషిన్స్‌పై కూడా అదనపు పన్నులు ఉంటాయి.అయితే పాన్ మసాలా తయారీపై కొత్తగా ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్, పొగాకుపై ఎక్సైజ్ సుంకాన్ని విధించడానికి అనుమతించే రెండు బిల్లులను డిసెంబర్‌లో పార్లమెంట్ ఆమోదించింది.

# రామస్వామి క్యాంప్ గ్రామంలో ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డ్ కార్యక్రమం విజయవంతం



నిజామాబాద్ (ఆలూరు) జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రామస్వామి క్యాంప్ గ్రామంలో వెల్నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత ఫ్యామిలీ హెల్త్ కార్డ్ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. గ్రామ ప్రజల ఆరోగ్య భద్రత లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెల్నెస్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ బృందం గ్రామస్తులకు ఫ్యామిలీ హెల్త్ కార్డుల ప్రయోజనాలపై అవగాహన కల్పించి, మొత్తం 110 ఫ్యామిలీ హెల్త్ కార్డులను నమోదు చేశారు. ఈ కార్యక్రమం సుమన్, ప్రమోద్, సిడ్డు మరియు ప్రభు చరణ్ పర్యవేక్షణలో సక్రమంగా జరిగింది. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వెల్నెస్ హాస్పిటల్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని వెల్నెస్ హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పసుల పుష్ప మరియు ఉప సర్పంచ్ సైలూ తదితేరులు పాల్గొన్నారు.

## వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అఖండ భజన

సంగారెడ్డి జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సంగారెడ్డి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం లో నూతన సంవత్సరం సందర్భంగా అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు.

వాసవి ఆలయ కమిటీ చైర్మెన్, టీపీసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జయా గుణ చైతన్య రెడ్డి దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లో. నిర్మల జగ్గారెడ్డి, గుణ చైతన్య రెడ్డి లను సత్కరించారు. కరణ్ గజేంద్ర స్వామి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. వాసవి మాతా ఆలయానికి భూమిని ఇచ్చిన దాతలతో వివరాలతో కూడిన శిలాఫలకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. దాతలను సత్కరించారు.

# విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా.. డాక్టర్ సహా ఏడుగురు అరెస్ట్



తిరువనంతపురం జనవరి 2 (ఎక్స్ ప్రేస్స్ న్యూస్ );: విద్యార్థులు, డాక్టర్లకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఎండీఎంఏ, హైబ్రిడ్ గంజాయి, ఇతర మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక డాక్టర్ సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఈ సంఘటన జరిగింది. విద్యార్థులు, డాక్టర్లకు కొందరు వ్యక్తులు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు జిల్లా యాంటీ–నార్కోటిక్స్ స్పెషల్ యాక్షన్ ఫోర్స్‌కు సమాచారం అందింది. కాగా, కనియాపురం తోపిల్ ప్రాంతంలోని అద్దె ఇంటిలో డ్రగ్స్ సరఫరాదారులు నివసిస్తున్నట్లు యాంటీ–నార్కోటిక్స్ అధికారులకు తెలిసింది. దీంతో ఆ ఇంటిని చుట్టుముట్టి రైడ్ చేశారు. ఆ ఇంట్లో సోదాలు చేశారు. నాలుగు గ్రాముల ఎండీఎంఏ, గ్రాము హైబ్రిడ్ గంజాయి, వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఏడుగురు నిందితులను అధికారులు గుర్తించారు. డాక్టర్ విఘ్నేష్ దాతన్, డెంటల్ విద్యార్థిని హలీనా, ఐటీ ఉద్యోగి అవినాష్, అసిమ్, అజిత్, అన్సియా, హరీష్‌ను అరెస్ట్ చేశారు. అసిమ్, అజిత్, అన్సియా గతంలో అనేక మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులుగా ఉన్నారని నిర్ధారించారు. కాగా, నిందితులకు చెందిన రెండు కార్లు, రెండు బైకులతో పాటు పది మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఈ బృందాన్ని అడ్డగించే ప్రయత్నం విఫలమైందని పోలీస్ అధికారి తెలిపారు.

# ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్న ప్రభుత్వం

## -బిజెపి మాజీ ఎమ్మెల్యే డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మీడియా సమావేశం



వరంగల్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వైఖరి పూర్తిస్థాయిలో ద్వంద్వ వైఖరికి ప్రతీకగా మారిందని బిజెపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. ఒకవైపు కేసీఆర్ గారు శాసనసభకు రావాలని, ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలని పదేపదే కోరుతూనే మరోవైపు అదే కేసీఆర్‌పై దోపిడీ, అవినీతి, అక్రమాలు అంటూ తీవ్రమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారు. అవినీతిపరుడిగా ఆరోపిస్తున్న వ్యక్తి సలహాలు ముఖ్యమంత్రికి ఎందుకు కావాలి అన్న ప్రశ్నకు రేవంత్ రెడ్డి స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ దగ్గర నుంచి రేవంత్ రెడ్డికి కావాల్సిన సలహాలు - దోచుకోవడంలోనా దాచుకోవడంలోనా లేక తెలంగాణ ప్రజల హక్కులను పణంగా పెట్టే పాలనా విధానాల్లోనా.. అసలు ఈ సలహాలు పరిపాలన కోసం కావాలా... లేక రాజకీయ లావాదేవీలు, లోపాయికార ఒప్పందాల కోసమా అన్న అనుమానం ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం ఒక రాజకీయ నాటకమేనని, దాని వెనుక కాంగ్రెస్ -బీఆర్ఎస్ మధ్య లోపాయికార ఒప్పందం, అవగాహన దాగి ఉందన్న విషయం ఇప్పుడు ఒక్కొక్కటిగా ప్రజలకు అర్థమవుతోందని ప్రభాకర్ అన్నారు. పరిపాలన పేరుతో రాజకీయ లావాదేవీలు, రహస్య ఒప్పందాలే ప్రధాన అజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని విమర్శించారు.

### అవినీతి కేసులపై ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం - కాంగ్రెస్-బీఆర్ఎస్ కుమ్మక్కుకు నిదర్శనం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి కేసులపై ప్రభుత్వ వైఖరి స్పష్టంగా అనుమానాలకు తావిస్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణను నీరుగార్చడం, ఫోన్ ట్యాపింగ్ కేసును కావాలని సాగదీయడం, ఫార్ములా ఈ-రేస్ అక్రమాలపై కాగ్, పీఏసీ నివేదికలు ఉన్నా ఒక్క చర్య కూడా తీసుకోకపోవడం.. ఇవన్నీ కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న అంతర్గత ఒప్పందానికి స్పష్టమైన నిదర్శనాలని నిలదీశారు. భూముల అమ్మకాల విషయంలోనూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే విధానంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అప్పనంగా అమ్ముకుంటున్నాయి. ఈ రెండు పార్టీల వ్యవహారం 'నాకు నువ్వు-నీకు నేను' అన్నట్టుగా పిల్లలాటలా సాగుతోందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ-రేస్ కేసుల్లో విచారణ తుది దశకు చేరుకున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క అరెస్టు కూడా జరగకపోవడం వెనుక అసలు కారణం ఏమిటో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలి. రాష్ట్ర ఖజానాను దోచుకున్న వారిని చట్టపరంగా శిక్షించలేకపోయిందో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడం, శాసనసభ- శాసన మండలిలో ఇతర పక్షాలను విలీనం చేసుకోవడం వంటి రాజకీయ అడ్డదారులు ఎంచుకున్న చరిత్ర అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్‌తో 'నాకు నువ్వు - నీకు నేను' అన్నట్లుగా వ్యవహరిస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని ఎన్.వి.ఎస్.ఎస్. రేవంత్ సర్కారుకు చురకలంటించారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజాసేవ అనే మాటలు పక్కన పెట్టి, అధికారం- దోపిడీనే లక్ష్యంగా చేసుకొని కాలం వెల్లదీస్తోంది.

### పంచాయతీ ఎన్నికల గొప్పలు - గ్రామాభివృద్ధి మాత్రం శూన్యం

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇద్దరూ 'మావాళ్లే గెలిచారు' అంటూ గొప్పలు చెప్పుకోవడం చూస్తే, ఈ రెండు పార్టీల రాజకీయ నాటకాల తీరును ఎన్.వి.ఎస్.ఎస్. బట్టబయలు చేశారు కానీ వాస్తవం ఏమిటంటే-గ్రామాల అభివృద్ధికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసినదీ శూన్యమే. గతంలో బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో పెద్దఎత్తున అధికారం ఇచ్చినా సర్పంచుల ధర్నాలు, ఆత్మహత్యలు, నిరసనలు తప్పలేదు. ఇప్పుడు కాంగ్రెస్‌కు అదే స్థాయిలో అధికారం అప్పగించినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదన్నారు. అంటే గ్రామీణ తెలంగాణను అప్పటి బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయనేది రుజువైందని పేర్కొన్నారు. అధికారమే పరమావధిగా రెండు పార్టీలూ ప్రజల సమస్యలను పక్కన పెట్టి రాజకీయ ఆటలతో కాలం గడుపుతున్నాయన్నది గ్రామీణ తెలంగాణ ప్రజలకు ఇప్పుడు స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

### కేంద్ర నిధులే పంచాయతీలకు ప్రాణాధారం - రాష్ట్రం నుంచి దమ్మిడీ లేదు

గ్రామీణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంనుంచి కనీస నిధులే లేకపోవడం దారుణమైన వాస్తవం. ఈరోజు పంచాయతీలు నిలబడగలుగుతున్నాయంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వచ్చే నిధుల వల్లేనని ఎన్.వి.ఎస్.ఎస్ ప్రభాకర్ తేల్చిచెప్పారు. కేంద్రం నుంచి నేరుగా వచ్చే నిధులే పంచాయతీలకు ప్రాణాధారంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను పూర్తిగా విస్మరించడంతో ఒకవైపు గ్రామాల్లో మౌలిక వసతులు క్షీణిస్తుంటే, మరోవైపు భారీ ప్రాజెక్టుల పేరుతో దోపిడీ రాజకీయాలు కొనసాగుతున్నాయని ఆయన మండిపడ్డారు.

### కాళేశ్వరం తర్వాత పాలమూరు - అదే కథ, అదే దోపిడీ

గతంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో స్థల మార్పిడి, అంచనాల పెంపు, వేల కోట్ల కమీషన్ల ఆరోపణలు ఎలా వచ్చాయో ఇప్పుడు పాలమూరు ఎత్తిపోతల పథకంలో కూడా అదే కథ, అదే దోపిడీ కనిపిస్తోందని ప్రభాకర్ మండిపడ్డారు. పార్టీ మారినా, ప్రభుత్వం మారినా విధానం మాత్రం మారలేదు. ఈ మొత్తం రాజకీయ నాటకానికి కనిపించని దారాలు లాగుతున్నది రాహుల్ గాంధీయే. కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీలను అనుసంధానం చేస్తున్నది రాహుల్ గాంధీయే. కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న అంతర్గత బంధం, అనుబంధం రోజురోజుకీ బహిర్గతమవుతోందని నిగ్గుతేల్చారు.

### ప్రభుత్వ ఆస్తులు కరిగిపోతే మంత్రుల ఆస్తులు పెరుగుతున్నాయి

మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్తులు క్రమంగా కరిగిపోతుంటే అధికారంలో ఉన్న మంత్రుల వ్యక్తిగత ఆస్తులు మాత్రం రోజురోజుకీ విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు అమ్మడం, ప్రజా ఆస్తులను తాకట్టు పెట్టడం, అదే సమయంలో వ్యక్తిగత సంపదను పెంచుకోవడం... ఇదే ఈ కాంగ్రెస్ ప్రభుత్వ అసలు విధానమని ఎన్.వి.ఎస్.ఎస్. నిప్పులు చెరిగారు.

### కాంగ్రెస్ అంటేనే కమీషన్లు, కరప్షన్, కాంట్రాక్టులు

పాలన పేరుతో ప్రజలను మభ్యపెట్టి, ఆస్తుల దోపిడీనే అజెండాగా ముందుకు వెళ్లడం కాంగ్రెస్ రాజకీయాలకు కొత్తేమీ కాదని.... కాంగ్రెస్ అంటేనే కమీషన్లు, కరప్షన్, కాంట్రాక్టుల రాజకీయాలు అన్న చేదు నిజం ఈరోజు దేశవ్యాప్తంగా బహిర్గతమవుతోంది. అందుకే క్రమేణా ఒక్కో రాష్ట్రంలో ప్రజల తీర్పుతో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతోంది. తెలంగాణ కూడా దీనికి మినహాయింపు కాదన్నది కాంగ్రెస్ పాలన మొదలైన కొద్ది కాలంలోనే స్పష్టమైందని ప్రభాకర్ తెలిపారు. తెలంగాణలో సాగుతున్న కాంగ్రెస్-బీఆర్ఎస్ కపటనాటకాన్ని, ప్రజల దృష్టిని మళ్లించే డైవర్షన్ రాజకీయాలను భారతీయ జనతా పార్టీ పూర్తిగా ప్రజాక్షేత్రంలో బట్టబయలు చేస్తుంది. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, అవినీతి పాలనను నిలదీస్తుంది.

తెలంగాణ ప్రజలు గట్టిగా ఆలోచించి, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజు దగ్గరల్లోనే ఉందని డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ హెచ్చరించారు.

# బీజేపీ అజేయమైన శక్తిగా ఎదగాలి..గ్రూపులు బువ్వ పెట్టవు

### -నన్ను గెలిపించారు.. మీ గెలుపు కోసం నేను కూడా కష్టపడతాను
### -నువ్వు లీడర్లను గౌరవిస్తేనే.. నిన్ను కార్యకర్తలు గౌరవిస్తారన్నారు
### -మున్సిపల్ ఎన్నికల సన్నాహాస సభలో ఎంపి ఈటల రాజేందర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాజకీయ నాయకుడికి గెలవడమే అంతిమ గీటురాయి సుపరిపాలన, ప్రజలు మెచ్చే పాలన అందించడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యం అని ఈటల రాజేందర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహాస సభలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ మన పరివార క్షేత్రాలు అనేక సమస్యల మీద కొట్లాడుతాయి. కానీ వాటిని పరిష్కరించే సత్తా అధికారంలోకి వస్తేనే ఉంటుంది. అనేక సంవత్సరాల స్వప్నం 370 ఆర్టికల్ రద్దు కేంద్రంలో ప్రభుత్వం ఉండటం వల్లనే సాధ్యమైంది. రామాలయం కోసం అనేకమంది ప్రాణ త్యాగాలు చేశారు, వేలమంది జైల్లో మగ్గారు. చివరికి అది ఫుల్ ఫిల్ అయింది అంటే కేంద్రంలో మన ప్రభుత్వం ఉండటం వల్లనే. అధికారం రాకపోతే.. మనం గెలిచిన వారి ఇంటి ముందు కాపలాకాయాల్సిందే నన్నారు. మస్కా కొట్టి పని చేయించుకునే పరిస్థితి పోవాలంటే మనం గెలవాలి. దుర్మార్గన్ని ఆపగలిగే శక్తి అధికారానికే ఉంటుంది. నేను ఎంపీగా గెలిచానంటే అది మీ అందరి అండతోనే. నా 25 సంవత్సరాల రాజకీయ జీవితంలో.. హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్క ఎంపీపీ కానీ.. ఒక్క జడ్పీటిసి కానీ.. ఒక మున్సిపల్ చైర్మన్ కానీ... నీటి సంఘాల చైర్మన్లు సింగిల్ విండో చైర్మన్లు ఏదీ ఓడిపోలేదు. వయసు, రాజకీయ జీవితం చిన్నదే అయినా.. తొమ్మిది సార్లు ఎమ్మెల్యేగా కొట్లాడాను.. ఒక 40 ఎలక్షన్స్ కు ఇంచార్జిగా పనిచేశాను.గెలవాలంటే మొట్టమొదటిగా.. మంచి అభ్యర్థిని ఎంపిక చేయండి అని పిలుపునిచ్చారు. సామాజిక వర్గాల సమీకరణ మర్చిపోవద్దు. వాతావరణ కల్పన జరగాలి. ఎదుటివారికి చెమటలు పట్టించాలి. గట్టి లీడర్లను పార్టీలో చేర్చుకోవాలి. భారతీయ జనతా పార్టీ 2 ఎంపీ సీట్లు గెలిస్తే అది ఒకటి గుజరాత్ నుంచి ఇంకోటి తెలంగాణ నుంచి.. ఇప్పుడు గుజరాత్ ఎక్కడ ఉంది తెలంగాణ ఎక్కడ ఉంది ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఒక పెద్ద మనిషి మమ్మల్ని హెచ్చరించారు. 27 ఏళ్ల తర్వాత కూడా గుజరాత్ లో మళ్లీ అధికారంలోకి వస్తే..45 ఏళ్ల తర్వాత కూడా తెలంగాణలో అధికారం వస్తుందో రాదో అనే సంశయంలో ఉన్నారు అని అన్నారు. పార్టీలో చేరిన లీడర్లను గౌరవించండి అక్కున చేర్చుకోండి కాకులు గద్దల లెక్క పొడవకండి. రాజకీయాల్లో విశాల హృదయంతో ఉండాలి, గొప్పగా ఆలోచించాలి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. బీజేపీ నేతలు కూడా అలా ఆలోచన చేయాలన్నారు.

పరిపక్వత పెరగాలి కలిసి పనిచేయాలి. స్థానికంగా గ్రూపులు మంచివి కావు. గ్రూపులు బువ్వ పెట్టవు. ఉన్న శక్తే తక్కువ ఇందులో గ్రూప్స్ అవసరమా తెలంగాణ ఉద్యమం కోసం కాళ్ళ మీద పడి నాయకులను కాపాడుకున్నాం. వేరే పార్టీ వారిని తెచ్చుకున్నాం, ఎన్నికల్లో గెలిపించు కున్నాం. మల్కాజిగిరి పార్లమెంట్ లో 1992 నుండి ఉంటున్న నన్ను నాన్ లోకల్ అని ప్రచారం చేస్తున్న వారిని పట్టించుకోవద్దు. 25 ఏళ్ల నుండి పార్టీని నమ్ముకునే పని చేసే నిజమైన కార్యకర్తకు పిల్లల ఫీజు కట్టే డబ్బులు కూడా ఉండవు. పార్టీ బలంగా ఉంటే గెలవడానికి పైసలు అక్కర్లేదు. కేవలం డబ్బుతోనే రాజకీయాలు నడవవన్నారు.. నేను పొత్తుల సద్దిని.మోడీ గారు ప్రధానమంత్రి అయితేనే దేశం సుభిక్షంగా ఉంటుందని దేశవ్యాప్తంగా ఒక వేవ్ వచ్చింది. ఈటల రాజేందర్ వల్ల కొంచెం ఎక్కువ ఓట్లు రావచ్చు కానీ గెలిచింది మాత్రం మోదీ గారి వల్లనే. ఆ వేవ్ ను మనకు అనుకూలంగా మార్చుకోవడం వల్లనే నాలుగు లక్షల మెజారిటీ వచ్చింది. గౌరవం పరస్పరంగా ఉండాలి. నువ్వు లీడర్లను గౌరవిస్తేనే.. నిన్ను కార్యకర్తలు గౌరవిస్తారన్నారు. బీజేపీ అజేయమైన శక్తిగా ఎదగాలి. నన్ను మీరు గెలిపించారు. మీ గెలుపులో ఉడత భక్తిగా సాయం చేస్తా.నా చేతులు దండం పెట్టడానికి అలవాటు పడ్డాయి. నాకు ప్రజలే దేవుళ్ళు. మీకోసం ఎన్నిసార్లయినా దండం పెడతా. మంచికి ఎప్పుడూ గొప్ప స్థానం ఉంటుంది. మన కొట్లాట వల్ల జి హెచ్ ఎం సి లో మన కార్పొరేటర్స్ కి 300 కోట్ల నిధులు వచ్చాయి.

బీజేపీ లెటర్ ప్యాడ్ మీద లెటర్ పెడితే కోట్ల నిధులు వచ్చాయి. మోడీ గారు ఎప్పుడూ నేను ఇచ్చిన అనరు, నేను సేవకుడిని మాత్రమే.. ప్రజలే యజమానులు అని అంటారు. ఇక్కడున్న సంకుచిత వాదులు మాత్రం నేను ఇచ్చిన అంటారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయడం నుండి నేను మీకు అండగా ఉంటాను.జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి నందా రెడ్డి చంద్రారెడ్డి శోభమ్మ రామోజీ సురేష్ మోహన్ రెడ్డి సుధాకర్ లక్ష్మమ్మ శైలజ వెంకటరెడ్డి శ్రీనివాస్ పావని తదితరులు పాల్గొన్నారు



గురువారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ 2026 డైరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. చిత్రంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు మరియు నూతన కార్యవర్గం.

## జనవరి 4న ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు

### – రాష్ట్ర కన్వీనర్ యెల్లపోశెట్టి



రాజన్న సిరిసిల్ల,జనవరి 2:నేటినిజం (ప్రతినిధి): హైదరాబాద్ అల్వాల్ లో జనవరి 4వ తేదీన ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు రాష్ట్ర కన్వీనర్ యెల్లపోశెట్టి తెలిపారు. ఉద్యమ కళాకారులు, రచయితలు, కవులు, సాహితీవేత్తలు, వివిధ జిల్లాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కన్వీనర్లు, కో-కన్వీనర్లు బాధ్యతగా దీక్ష శిబిరానికి హాజరై, సంఘీభావాన్ని తెలుపాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కో-ఆర్డినేటర్ బొడ్డు రాములు, గడ్డం సుధాకర్, వెన్నమల్ల వెంకటేష్, తదితర జిల్లాల ఇన్చార్జులు పాల్గొన్నారు.

## కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలి: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మాజీ సిఎం కెసిఆర్ వదిలిన బాణం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కవిత కన్ఫ్యూజన్ లో ఉండి ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తుందని అన్నారు. కవిత వ్యాఖ్యలకు కోమటిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కవిత ఏ పార్టీలో ఉందో స్పష్టం చేయాలని, తన తండ్రి మీద సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిందన కవిత.. మాజీ మంత్రి హరీష్ రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

## రోడ్డు భద్రత వారోత్సవ భాగం లో ఆర్ టీ సి డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమం

హైదరాబాద్ జనవరి. 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )రోడ్డు భద్రత వారోత్స వం భాగం లో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు ఏ సి పి ఆదేశాల తో బర్కతపురఆర్ టీ సి డిపో లో మేనేజర్ మంజులతో కలిసి డ్రైవర్ లకు రోడ్డు భద్రత పై ముఖ్య సూచనలు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన ఎస్ ఐ లు శ్రీకాంత్ ఆర్ ఎస్ ఐ తో పాటు రాకేష్ లు పాల్గొని డ్రైవర్లకు సూచనలు ఇచ్చారు.

ముఖ్యం గా రోడ్డు పై కనురెప్పపాటున జరిగే ప్రమాదలను దృష్టిలో పెట్టుకుని, ప్రయాణికులను, కుటుంబ సభ్యులను అందరి గురించి ఆలోచించాలని కాగా బస్సు నడిపించే టప్పుడు సెల్ ఫోన్లో మాట్లాడవద్దని అన్నారు.

# అల్ఫోర్స్ టైనిటాట్స్ లో ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



కరీంనగర్, జనవరి 2: (నేటినిజం ప్రతినిధి) అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు మహోత్సవంగా జరిగాయి. డూ డూ బసవన్న చేసినటువంటి చేష్టలు, విద్యార్థులు పలు సంప్రదాయ దుస్తులలో విచ్చేసి పండగ వైభవాన్ని చాటి చెప్పారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి పలు నమూనాలు సంక్రాంతి వైభవాన్ని తెలియపరిచాయి. ఈ సందర్భంగా డాక్టర్ వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉన్నదని, శ్రీమహావిష్ణువు అత్యంతం ప్రీతికరమైన పండుగ అని చెప్పారు. పల్లె వాతావరణం ఉట్టిపడేలా కనబడుతుందని, ఈ పండుగ ద్వారా కుటుంబ సభ్యులందరూ పల్లెలకు వెళ్లి సంక్రాంతి శుభాకాంక్షలు తెలపడంతో పాటు చాలా వృక్షాయంగా నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థి జాతీయస్థాయి ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి వాలిబాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్, జనవరి 2: (నేటినిజం ప్రతినిధి) స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థి ఎస్ జి ఎఫ్ వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా అల్ఫోర్స్ సంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉందని మరియు చాలామంది ఆడటానికి క్రేజ్ చూపెడతారని వారు చెప్పారు. వాలీబాల్ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకమైన నియమ నిబంధనలు ఉన్నాయని ఆయన నిబంధనల గురించి ప్రతి విద్యార్థికి తెలిసి ఉండాలని తద్వారా వారు ఆ క్రీడలో నైపుణ్యం సాధించగలుగుతారని అభిప్రాయపడ్డారు.వాలీబాల్ క్రీడలో నిష్ణాతులైన క్రీడాకారులు ఉన్నారని మరియు అద్భుతమైనటువంటి అవకాశాలను దైవసం చేసుకుని సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి కూడా వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పాల్గొని ఆసక్తిని పెంపొందించుకోవాలని వారు కోరారు.

ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో నిర్వహింపబడినటువంటి పలు పోటీలలో చాతుర్యాన్ని ప్రదర్శించినటువంటి విద్యార్థులకు వివిధ పోటీలకు ఎంపిక చేయడమే కాకుండా వాటిలో పాల్గొనేందుకు సరైనటువంటి శిక్షణతో పాటు వనరులను కల్పించి అగ్రగామిగా నిలుపుతున్నామని హర్షం వ్యకం చేస్తూ ఇటీవల కాలంలో పెద్దపల్లి జిల్లా నంది మేడారంలో నిర్వహించినటువంటి నిర్వహించినటువంటి ఎస్సీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలలో పాఠశాలకు చెందినటువంటి జి.హనీయాన్స్ రెడ్డి, 8వ



తరగతి, అండర్ -14 బాలుర విభాగంలో అద్భుతమైన ప్రదర్శన కనబరచడమే కాకుండా రాష్ట్ర స్థాయిలో పతాకాన్ని సాధించి త్వరలో హిమాచల్ ప్రదేశ్ లో నిర్వహించబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికపోవడం చాలా గొప్ప విషయమని వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రంధాలయ చైర్మన్ చేతులమీదుగా ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



కరీంనగర్, జనవరి,02స్టేట్ టీచర్స్ యూనియన్ కొత్తపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్ శుక్రవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక పఠనం, గ్రంథ పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో రీడింగ్ కార్నర్లు ఏర్పాటు చేయాలని సూచించా రు.అవసరమైన చోట గ్రంథాలయం నిర్వహణకోసం చరిత్ర,పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందజేయనున్నట్లు తెలియజేశారు.

పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా పూర్వ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఆర్ శ్రీనివాస్, కట్టా రవీంద్రచారి, కొత్తపల్లి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెలిచాల వెంకటస్వామి, తాడూరి మాధవస్వామి, ఎస్టీయూ సీనియర్ నాయకులు కొట్టె లక్ష్మణ రావు, చాడ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com